నాడూ.. నేడూ.. ఏం మారింది సారూ?

ఆంధ్రజ్యోతి విజిట్

జిల్లాలో తీరుమారని ప్రభుత్వ పాఠశాలలు
ఆర్భాటంగా జగన్ ప్రభుత్వ ప్రచారం
అరకొర పనులతో అసంపూర్తిగా వదిలేసిన వైనం
పూర్తయిన పనులకూ నిర్వహణ లోపం
ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ పరిశీలనలో వెల్లడైన వాస్తవాలు

కార్పొరేట్ బడులు వెలవెలపోయేంతగా ప్రభుత్వ బడుల రూపురేఖలే మార్చేస్తాం అన్నారు. అందమైన భవనాలు, ఫర్నిచర్.. ఫిల్టర్ వాటర్, శుభ్రమైన టాయ్‌లెట్లు... ఒక అద్భుతం చేసి చూపిస్తాం అని చెప్పారు. "మన బడి... నాడు-నేడు" అని దానికి పేరు కూడా పెట్టి ఊదరగొట్టారు. జగన్ ప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులుగా చెప్పుకున్న ఈ బడులు జిల్లాలో ఎలా ఉన్నాయి? నిజంగానే రూపురేఖలు మారిపోయాయా? జగన్ ప్రభుత్వం మొదటి విడత "మన బడి... నాడు-నేడు" కింద అభివృద్ధి చేసిన స్కూళ్ల స్థితిగతులెలా వున్నాయో.. పరిశీలనకు పూనుకుంది ఆంధ్రజ్యోతి. మంగళవారం మా ప్రతినిధులు కొన్ని పాఠశాలలను సందర్శించి వాటి స్థితిగతులను సచిత్రంగా అందిస్తున్నారు.

-తిరుపతి, ఆంధ్రజ్యోతి


కోట మండలం చిట్టేడు ఉన్నత పాఠశాలలో బెంచీల్లేక కింద కూర్చున్న విద్యార్థులు



పాకాల ఎన్‌వీఎన్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో అసంపూర్తిగా తరగతి గది నిర్మాణం

పాకాల: రక్షిత నీరు లేదు

పాకాల, ఆంధ్రజ్యోతి: పాకాలలో ఇంగ్లీషు, తెలుగు మీడియం స్కూళ్ళు ఒకే ఆవరణలో వున్నాయి. అదనపు తరగతి గది నిర్మాణం అసంపూర్తిగా వుంది. టాయిలెట్ బ్లాక్ సైతం అసంపూర్తిగానే వుంది. తాగునీటి ఆర్వో సిస్టమ్ పనిచేయడం లేదు. మండలంలో మొదటి విడత నాడు-నేడు కింద ఎంపికైన స్కూళ్ళలో 15 స్కూళ్లలో ఆర్వో సిస్టమ్ పనిచేయడం లేదు.


తిరుచానూరు జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులకు సున్నాలు కూడా కొట్టని వైనం

తిరుచానూరు జడ్పీ హైస్కూల్: భయపెడుతున్న గదులు

తిరుచానూరు, ఆంధ్రజ్యోతి: తిరుచానూరు జడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయినా ఫినిషింగ్ పనులు పెండింగులో వున్నాయి. సున్నాలు కూడా కొట్టించలేదు. అయితే ఆ గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గదుల్లో ఎలక్ట్రిఫికేషన్ తూతూ మంత్రంగా చేపట్టారు. గదుల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల కోసం వైర్లు ఎలాబడితే అలా అమర్చివుండడం కనిపించింది.



చిన్నగొట్టిగల్లు ప్రాథమిక పాఠశాలలో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గది నిర్మాణం - పనిచేయని ఆర్వో సిస్టమ్

చిన్నగొట్టిగల్లు బడి: అన్నీ అరకొర పనులే!

చిన్నగొట్టిగల్లు, ఆంధ్రజ్యోతి: చిన్నగొట్టిగల్లు ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం సగంలోనే ఆగిపోయింది. నీటి కొరతతో తాగునీటి ఫిల్టర్ సిస్టమ్ వినియోగంలో లేదు. సరఫరా అవుతున్న కొద్దిపాటి నీరు టాయిలెట్ల వాడకానికే సరిపోతోంది. స్కూలు ప్రహరీ గోడ కూలిపోయి చాలాకాలమైంది. అయినా పనులు చేపట్టలేదు.


చంద్రగిరి జడ్పీ బాలుర హైస్కూలు తరగతి గదిలో ఫ్యానుకు రెండే రెక్కలున్న దృశ్యం

మంగళం ట్రెండ్స్ పాఠశాల: అసంపూర్తి నిర్మాణాలు

తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి: జిల్లాలోనే గణనీయంగా అభివృద్ధి చెందిన జడ్పీ హైస్కూలుగా తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ట్రెండ్స్ పాఠశాలకు గుర్తింపు వుంది. తొలి విడత నాడు-నేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. రెండంతస్తుల భవనం శ్లాబులు పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో గోడలు కట్టారు. పై అంతస్తులో అది కూడా లేదు. నిధుల కొరతతో అర్ధంతరంగా పనులు ఆపేశారు. తాగునీటి సదుపాయం వుంది కానీ ఫిల్టర్ సిస్టమ్ లేదు. చదువులు చెప్పే ఉపాధ్యాయులకు కుర్చీలు, టేబుళ్ళు వంటి ఫర్నిచర్ ఇంతవరకూ రాలేదు. ప్రహరీ గోడల నిర్మాణం కూడా అసంపూర్తిగా ఆగిపోయింది.


మంగళం ట్రెండ్స్ హైస్కూల్లో అసంపూర్తిగా వున్న అదనపు తరగతి గదుల నిర్మాణం

చంద్రగిరి బాలుర హైస్కూల్: రెండు రెక్కల ఫ్యాను

చంద్రగిరి, ఆంధ్రజ్యోతి: చంద్రగిరి జడ్పీ బాలుర హైస్కూల్లో తరగతి గదులకు కిటికీలు పగిలిపోయి వున్నాయి. విద్యార్థులకు డెస్కులు, టీచర్లకు కుర్చీల కొరత వుంది. ల్యాబ్‌లో నాలుగేళ్ళుగా పరికరాలు లేవు. గ్రీన్ చాక్ బోర్డులు, స్మార్ట్ టీవీ ఏర్పాటు కాలేదు. ఓ తరగతి గదిలో ఫ్యానుకు రెక్క విరిగిపోవడంతో రెండు రెక్కలతో కనిపిస్తోంది. అక్కడే జడ్పీ బాలికల హైస్కూలులో ఉపాధ్యాయుల గది పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షాలకు ఉరుస్తోంది. సభా వేదిక సైతం వర్షాలకు ఉరుస్తోంది. అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఆగిపోయింది. వంట గది లేదు.

ఇలా ఉన్నాయి బడులు..

జిల్లాలో సైతం రెండు విడతల్లో 1800 పాఠశాలలను ఎంపిక చేసిన ప్రభుత్వం అరకొర నిధులతో ఉపాధ్యాయుల గొంతుపై కూర్చుని పనులు మొదలు పెట్టించింది. ఆపై నిధుల కొరత, నిర్లక్ష్యాలతో అర్ధాంతరంగా పనులు నిలిపేసింది. అటు పనులూ పూర్తి కాకపోగా, ఇటు పనులు చేపట్టిన ఉపాధ్యాయుల చేతి చమురు కూడా వదిలింది.


- వడమాలపేట మండలం సీతారామాపురం హైస్కూలులో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణం
- పుత్తూరు మండలం పిళ్ళారిపట్టులో అర్ధాంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల నిర్మాణం.
- వడమాలపేట మండలం పాదిరేడు యూపీ స్కూలులో పనిచేయని ఆర్వో ప్లాంటు.


డెస్కులున్నా నేలపైనే కూర్చున్న విద్యార్థులు

ఏకొల్లు ప్రైమరీ బడి: ఏదీ వాడడం లేదు!

దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి: దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామంలోని ప్రైమరీ స్కూల్లో నాడు-నేడు కింద అన్ని వసతులూ కల్పించారు. కానీ దేన్నీ వాడడం లేదు. వంట గది, మరుగుదొడ్లు కూడా కట్టించారు. అయితే నీటి కొరతతో వినియోగించలేక వాటికి తాళాలు వేశారు. ఆర్వో ఫిల్టర్ సిస్టమ్ వున్నా వాడకుండా మూలన పడేశారు. ఫర్నిచర్ వున్నా పిల్లలు నేలపైనే కూర్చుని చదువుకుంటున్నారు. స్మార్ట్ టీవీ కూడా వుంది. కానీ వాడడం లేదు. గ్రీన్ చాక్ బోర్డులు, ఫర్నిచర్ అంతా ఓ గదిలో మూలన పడేశారు. ప్రహరీ ఒక వైపు కట్టలేదు. గోడలపై పెయింటింగ్ చేయలేదు.


వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ఉన్నత పాఠశాలలో టాయిలెట్లకు నీటి సరఫరా లేక తలుపులకు వేసిన తాళాలు



భూ బకాసురులపై ఉక్కుపాదం

- ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటు దిశగా యంత్రాంగం చర్యలు

జిల్లాలో శాంతిభద్రతల సమస్యకు ప్రధాన కారణం.. భూ ఆక్రమణలు. పైసా పైసా కూడబెట్టి, అప్పోసప్పో చేసి స్థలం కొనే నిరుపేదల ఆశలను, ఆర్థికస్థితిగతులను ఛిన్నాభిన్నం చేస్తున్నదీ భూకబ్జాలు. సొంతింటి కలలను కల్లలు చేసేదీ భూబకాసురులే.

గత సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ఎస్పీ కార్యాలయానికి వచ్చిన 95 అర్జీల్లో 63 భూసమస్యలకు సంబంధించినవే. మంగళవారం ఎస్పీ హర్షవర్ధన రాజుకు అందిన నాలుగు ఫిర్యాదులూ ఇవే.

ఘర్షణలకు కారణమవుతున్న.. సామాన్యుల జీవితాలను తల్లకిందులు చేస్తున్న భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపేలా ఎస్పీ చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తో చర్చించి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

అధికారం.. అధికారుల అండ ఉంటే చాలు. తనది కాని భూమిని సొంతం చేసుకుంటున్నారు కొందరు. రికార్డుల్లో పేర్లే మార్చేస్తున్నారు. తిరుపతి నగరంలో అయితే మరీ రెచ్చిపోతున్నారు. సామాన్యుల స్థలాలను కబ్జాచేసేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదేంటని అడిగితే దాడులు చేస్తున్నారు. చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు. దీంతో భూ బకాసురుల ఆగడాలను ఎదుర్కోలేక సామాన్యులు కుమిలిపోతున్నారు. వీటిపై అధికారులకు ఫిర్యాదులు చేయడమే కానీ న్యాయం జరిగిన దాఖలాలు లేవు. భూ ఆక్రమణలు ఆగనూ లేదు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం భూ వివాదాలకు సంబంధించినవే. ఈ క్రమంలో భూకబ్జాలకు అడ్డుకట్ట వేస్తే జిల్లాలో శాంతిభద్రతలు మెరుగు పడతాయని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఈ దిశగా కలెక్టరుతో చర్చించి ప్రత్యేక టాస్క్‌ఫోర్సు ఏర్పాటుకు పోలీసు యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. ఎక్కడెక్కడ భూ బకాసురులు ఉన్నారు? ఎప్పటి నుంచి.. ఎక్కడెక్కడ భూములు ఆక్రమిస్తున్నారు? వారి నేర చరిత్ర ఏమిటి? వారి వెనుక ఉన్న రౌడీలు, గూండాలు ఎవరనే దానిపై లోతుగా అధ్యయనం చేయనున్నారు. జిల్లాతో పాటు ప్రధానంగా తిరుపతిలో పెరిగిపోతున్న భూ ఆక్రమణలపై గట్టి చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి.. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలతో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రత్యేక టాస్క్‌ఫోర్సులో రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో రిటైర్డు న్యాయమూర్తి, రిటైర్డు డిప్యూటీ కలెక్టర్, రిటైర్డు తహసీల్దార్, అనుభవజ్ఞులైన మేధావులు, నగర ప్రముఖులు, సర్వేయర్లను నియమించే యోచనలో ఉన్నారు. దీనికి సంబంధించి త్వరలో జిల్లా అధికారులు సమావేశమై నిర్ణయం తీసుకునే అవకాశాలు వున్నాయి. ఇదే అమలైతే జిల్లాలో భూ ఆక్రమణలకు చాలావరకు అడ్డుకట్ట పడే అవకాశాలున్నాయి.

భూకబ్జాలపై కఠిన చర్యలు

జిల్లాతో పాటు తిరుపతిలో పెరిగిపోతున్న భూ కబ్జాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధనరాజు స్పష్టంచేశారు. మంగళవారం తనను కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. భూఆక్రమణలకు పాల్పడేవారి జాబితాను తెప్పించుకుని ఆ తర్వాత అవసరమైన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అవసరమైతే భూ ఆక్రమణలపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వీటన్నింటిపై త్వరలో కలెక్టర్‌తో చర్చించి భూ ఆక్రమణలకు పూర్తిస్థాయిలో చెక్‌పెట్టేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. దీనివల్ల శాంతి భద్రతల సమస్యలు తగ్గే అవకాశాలున్నాయన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు

- పలువురికి అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు


మణిదీప్‌రెడ్డి


నిఖిల్


యశ్విత

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలలో ప్రవేశాలకోసం నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ(ఎన్టీఏ) ఆధ్వర్యంలో గతనెలలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ తొలివిడత ఫలితాలను మంగళవారం సాయంత్రం విడుదల చేశారు ఈఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదివే పలువురు విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ మార్కులు సాధించి సత్తాచాటారు. వీరిలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన ఎం.భానుచరణ్‌రెడ్డి(99.99 పర్సంటైల్), డి.మణిదీప్‌రెడ్డి (99.98), కె.నిఖిల్ (99.98), టీవీ ధనుష్ (99.97), కార్తీక్ శ్రీలక్ష్మిపతి (99.93), కె.యశ్విత (99.90), శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన కె.అభిరామ్ (99.83), ఓరుగంటి మోక్షిత్ శర్మ (99.83), కె.జీవనకుమార్ (99.26), వై.నిఖిల్ (99.08), టీవీకే జూనియర్ కళాశాల (అమరావతి ఐఐటీ అకాడమీ)కు చెందిన బి.అరుణ్‌కుమార్‌రెడ్డి (99.93), శ్రీధర్స్ ఐఐటీ, జేఈఈ-నీట్ అకాడమీ విద్యార్థి పి.నిఖిలేశ్వర్ (99.25) పర్సంటైల్ మార్కులు సాధించి ప్రతిభచాటారని నిర్వాహకులు పేర్కొన్నారు.


ఓఎం శర్మ


జీవన్‌కుమార్


నిఖిల్

సత్తాచాటిన అధ్యాపకుడి కుమారుడు

శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లెకి చెందిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు మాండవీపురం జయభారత్‌రెడ్డి, రేఖ దంపతుల కుమారుడు భానుచరణ్‌రెడ్డి 99.99 పర్సంటైల్ మార్కులతో సత్తాచాటారు. 'ఐఐటీయే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకుని సాధన చేస్తున్నా. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేశా. కళాశాలలో టీచర్లు బోధించే అంశాలను క్రమం తప్పకుండా సాధన చేశా. అడ్వాన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలన్నది ఆశయం' అని భానుచరణ్‌రెడ్డి పేర్కొన్నారు.


భానుచరణ్‌రెడ్డి

ప్రతిభచాటిన ప్రభుత్వ టీచర్ కుమారుడు

శ్రీకాళహస్తికి చెందిన ప్రభుత్వ టీచర్ శ్రీనివాసబాబు, రాధిక దంపతుల కుమారుడు కె.అభిరామ్ 99.83పర్సంటైల్ మార్కులతో ప్రతిభచాటారు. 'ఐఐటీలో సీటు సాధనే లక్ష్యంగా అభ్యసన సాగించడంతో మంచి పర్సంటైల్ వచ్చింది. కళాశాలలో టీచర్స్ చెప్పిన నోట్స్, మెటీరియల్, టెక్నిక్స్‌ని క్రమం తప్పకుండా అనుసరించా. అడ్వాన్స్‌లో మంచి పర్సంటైల్ సాధించి ఐఐటీలో ఇంజినీరింగ్‌విద్యని చదవాలన్నది నా లక్ష్యం' అని అభిరామ్ చెప్పారు.


అభిరామ్

రైతు ఇంట విద్యాకుసుమం

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కుక్కరాజుపల్లెకి చెందిన రైతు రఘురామ్‌రెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్‌రెడ్డి 99.83 పర్సంటైల్ సాధించారు. 'టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని.. నిరంతరం సాధన చేయడం వల్ల మంచి పర్సంటైల్ వచ్చింది. కెమిస్ట్రీకి ఎన్‌సీఈఆర్టీ బుక్స్, గణితం, ఫిజిక్స్ సబ్జెక్టులలో అధ్యాపకులు బోధించిన నోట్స్‌ని ప్రణాళిక ప్రకారం అధ్యయనం చేశా. ఐఐటీలో సీటు సాధించాలన్నది ఆశయం' అని అరుణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.


అరుణ్‌కుమార్‌రెడ్డి

రాణించిన టీవీ టెక్నీషియన్ కుమారుడు

తిరుపతి నగరం జీవకోనకు చెందిన టీవీ టెక్నీషియన్ దయాకర్, మహేశ్వరి దంపతుల కుమారుడు పి.నిఖిలేశ్వర్ 99.25పర్సంటైల్ మార్కులు పొందారు. 'కళాశాలలో అధ్యాపకులు బోధించిన టెక్నిక్స్ ఉపయోగపడ్డాయి. పాఠశాల విద్య నుంచీ ఐఐటీలో సీటు సాధించాలన్న ఆశయంతో ప్రణాళిక ప్రకారం చదివా. అడ్వాన్స్‌లోనూ మంచి పర్సంటైల్ చూపి ఐఐటీలో కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్ చేయాలన్నది లక్ష్యం' అని చెప్పారు నిఖిలేశ్వర్.


నిఖిలేశ్వర్

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి విఘాతం



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాకాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి విఘాతం కలుగుతోందని సీనియర్ శాస్త్రవేత్త ప్రకాశరావ్ అన్నారు. గాదంకి జాతీయ వాయుమండలీయ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్) ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం జడ్పీహైస్కూల్‌లో స్వచ్ఛత పరిశుభ్రతపై ఆయన ప్రసంగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర నీటి కష్టాలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. 6,7 తరగతుల విద్యార్థులకు చిత్రలేఖన, 8,9, 10 విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. నీటి ట్యాంకులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త పి.రవిప్రసాద్, సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాస గుప్త, కార్యనిర్వహణాధికారి బి.మల్లికామాధురి,అకౌంట్స్ అధికారి జి.హరివెంకటకుమార్, పర్చేస్ అండ్ స్టోర్స్ అధికారి కెవి.సిజి పాల్గొన్నారు.

28లోగా రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్ భాషా

రామచంద్రాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి స్రవంతి తెలిపారు. పేరు, గ్రామం, ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను సమీపంలోని రైతు సేవాకేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 28వతేదీ లోపు నమోదు చేసుకోవాలని ఒక ప్రకటనలో వివరించారు. **ఎర్రావారిపాలెం:** ప్రతి రైతు విశిష్ఠ గుర్తిపు సంఖ్యను పొందాలని వ్యవసాయాధికారి ఖాదర్ భాషా తెలిపారు. ఎల్లమంద, ఉస్తికాయల పెంట గ్రామాల్లో బుధవారం పొలం బడి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇక మీదట రైతులకు ప్రభుత్వ సబ్సిడీ పొందాలన్నా ,వివిధ పథకాల కింద లబ్ధి కావాలన్నా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పని సరిగా ఉండాలని బాషా చెప్పారు. వరిలో సస్యరక్షణ చర్యలు, పురుగు నివారణ,యాజమాన్య పద్ధతుల గురించి ఆయన వివరించారు.

దీనదయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నేతల నివాళి



రామచంద్రాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాయలమండపం వద్ద మంగళవారం దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల బీజేపీఅధ్యక్షుడు జనార్దనచౌదరి మాట్లాడుతూ దీనదయాల్ తన బోధనల ద్వారా సంఘ సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాయం హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీమపందుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీలత, పక్కనే డాక్టర్ శోభామణి, డాక్టర్ సుజాత

తిరుపతి రూరల్, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత తెలిపారు. నిరంతర పశువైద్యవిద్య, సమాచారకేంద్రం ఆధ్వర్యంలో సీమపందుల పెంపకంపై నిర్వహించిన ఐదురోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. డీఈ డాక్టర్ శోభామణి మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, సీమ పందుల పెంపకం వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. సీసీవీఈసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత, శాస్త్రవేత్తలు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ మంజిరి, ఏపీ, తెలంగాణలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుపై దాడి



చికిత్స పొందుతున్న సెక్యూరిటీ గార్డు మూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న మూర్తి(30)పై ఇద్దరు గుర్తు తెలియని యువకులు దాడి చేశారు. శ్రీకాళహస్తి మండలం వేడాం దళితవాడకు చెందిన మూర్తి ప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడు. మంగళ వారం ఆస్పత్రిలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఇద్దరు గుర్తు తెలియని యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డగించారు. హఠాత్తుగా మీద పడి చేతులతో దాడి చేశారు. ఓ యువకుడి ఉంగరం తలకు తగలడంతో మూర్తి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరాడు.

జీతాలు పెంచాలని పంచాయతీ కార్మికుల ధర్నా



పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన కార్మికులు

రేణిగుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు ఆందోళనకు దిగారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇచ్చే జీతాలను కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. దీనికితోడు జీతాల నుంచి నగదు పట్టుకుంటున్నా పీఎఫ్‌కు మాత్రం జమ చేయడం లేదని తెలిపారు. యూనిఫామ్ కుట్టు కూలీలు కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆరు నెలల క్రితం డీపీవోను కలిసి వినతిపత్రం సమర్పించినా ఇంత వరకు స్పందన లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బకాయిలు చెల్లించడంతోపాటు పీఎఫ్ ఖాతాకు నగదు జమ చేసి ప్రస్తుతమిస్తున్న జీతాలను పెంచాలని కోరారు. లేనిపక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌పై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇందులో వచ్చే ప్రతి అర్జీని గడువులోపు రీఓపెన్‌కు తావు లేకుండా పరిష్కారం చూపాలన్నారు. ప్రతి సోమవారం అన్ని మండలాల పరిధిలో, డివిజన్ పరిధిలో తప్పనిసరిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు అర్జీదారుడి సమస్యలను స్వయంగా విని సంతృప్తికరమైన పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోస్మాండ్ తదితరులు పాల్గొన్నారు

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పాకాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్కు వీధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణలో ఈనెల 13వ తేదీ ఉదయం 11-30 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నారు. విద్యుత్‌శాఖ తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ ఎం.చిన్నరెడ్డప్ప ఈ విషయం తెలిపారు. అదాలత్‌లో విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస అంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు కె.రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీ కుమార్ పాల్గొంటారన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై నేడు సమావేశం

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఏర్పాట్లపై చర్చించేందుకు తలకోన సిద్ధేశ్వర స్వామి పాలక మండలి బుధవారం సమావేశం కానుంది. దేవస్థాన ప్రాగణంలో సమావేశం జరుగుతుందని ఆలయ ఈఓ మమత తెలిపారు. పాలక మండలి చైర్మన్ సోమనాథరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే నాని హజరవుతారన్నారు.

సారూ..చూడండి ఈ తారురోడ్డు తీరు

● 20 నెలలకే అధ్వాన స్థితి





ఆనందగిరి ఆలయానికి వెళ్లే మార్గంలో తారు లేచి అధ్వాన స్థితికి చేరిన రహదారి

పాకాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 20 నెలలకే అధ్వానంగా తయారైందీ రోడ్డు. ఊట్ల వారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై సుబ్రమణ్యస్వామి ఆలయానికి దామలచెరువు నుంచి చెరువు కట్టపై ఒక రోడ్డు వుంది. ఆలయ అభివృద్ధిలో భాగంగా రెండేళ్ల క్రితం ఆలయానికి తూర్పు వైపు నుంచి మణిపిరెడ్డిపల్లె రైల్వే గేటు సమీపంలో పాకాల కొత్తకోట రోడ్డును అనుసంధానిస్తూ రెండేళ్ల క్రితం రూ.18 లక్షలతో 1.4 కిలోమీటర్ల మేర మట్టిరోడ్డు వేశారు. ఐదు కల్వర్టులు నిర్మించారు. 20 నెలల క్రితం రూ.28 లక్షల వ్యయంతో తుడా నిధులతో తారురోడ్డు వేశారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో తారు రోడ్డు పనుల్లో నాణ్యత లోపించింది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల ఈపనులను పర్యవేక్షించారని సమాచారం. రెండు నెలల క్రితం వర్షాలకు 1.4కిలో మీటర్ల మేర ఈ తారు రోడుపై సుమారు 35 చోట్ల తారు లేచిపోయింది. కొన్ని చోట్ల కుంగిపోయి గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి అసంపూర్తిగా వున్న చోట్ల సీసీ రోడ్డు వేసి, అధ్వాన తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎందుకో...ఏమో!

● వైసీపీలో గాలి జగదీష్ చేరిక వాయిదా

● కారణాలపై రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు



గాలి జగదీష్

నగరి/పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా వైసీపీలో కలకలం రేగింది. మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు చిన్న కుమారుడు గాలి జగదీష్ నేడు వైసీపీలో చేరాల్సి వుండగా హఠాత్తుగా చేరిక వాయిదా పడింది.ఏ రాజకీయ పార్టీలోనూ లేకుండా అడపాదడపా నియోజకవర్గంలో పర్యటించి వెళుతున్న గాలి జగదీష్ బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం ఉదయాన్నే అనుచరులతో కలసి విజయవాడ బయల్దేరి వెళ్ళారు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ బుధవారం పార్టీలో చేరే కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. ఆయన వైసీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు, ఆ మేరకు విజయవాడ బయల్దేరి వెళ్లినట్టు, తీరా వెళ్ళాక చేరిక వాయిదా వేసుకున్నట్టు తెలియడంతో నగరి నియోజకవర్గ రాజకీయాల్లో దీనిపై జోరుగా చర్చ నడుస్తోంది. గాలి ముద్దుకృష్ణమ నాయుడు మరణం తర్వాత కుటుంబంలో ఆయన కుమారులు గాలి భాను ప్రకాష్, గాలి జగదీష్ ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు.రాజకీయంగా ఎడ మొహం పెడమొహంగా వుంటున్నారు. 2019 ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో గాలి భానుప్రకాష్ గెలుపునకు సోదరుడు సహకరించలేదన్న ప్రచారం జరిగింది. అలాగే 2024 ఎన్నికల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అప్పట్లోనే వైసీపీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదని తెలిసింది. గత ఎన్నికల నాటికి మాజీ మంత్రి రోజా రాజకీయంగా బలంగా వుండడం, అధిష్టానంలో పలుకుబడి కలిగివుండడంతో గాలి జగదీష్‌కు ప్రాధాన్యత లభించే పరిస్థితి కనిపించలేదు. అయితే గతేడాది ఎన్నికల తర్వాత పరిస్థితి మారింది. రోజా ఓడిపోవడంతో పాటు నియోజకవర్గానికి దూరమైనట్టుగా కనిపిస్తోంది. దానికి తోడు వైసీపీలోనే ఆమెను వ్యతిరేకించే వర్గాలు బలంగా వున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని సన్నిహితులు కొందరు జగదీష్‌ను వైసీపీలో చేర్చేందుకు తెర వెనుక సన్నాహాలు చేసినట్టు సమాచారం.బుధవారం తాడేపల్లిలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ముందస్తుగా జగదీష్ నియోజకవర్గవ్యాప్తంగా సన్నిహితులు, అనుచరులతో పాటు మాజీ మంత్రి రోజా వ్యతిరేక వర్గాన్ని కూడా కలసి తన చేరికకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరినట్టు సమాచారం. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుని మంగళవారం మధ్యాహ్నానికి ఆయన విజయవాడ చేరారని, గంటల వ్యవధిలో ఏమి జరిగిందో గానీ బుధవారం చేరిక కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. దీంతో నియోజకవర్గంలో రకరకాల ఊహాగానాలు ప్రచారమవుతున్నాయి. కొందరు మాజీ మంత్రి రోజా ఆయన చేరికను అడ్డుకున్నారని చెబుతుండగా మరికొందరు చేరిన తర్వాత పార్టీలో తగిన ప్రాధాన్యత వుంటుందో వుండదోనన్న అనుమానం జగదీష్ వర్గీయులకు రావడంతో వాయిదా వేసుకున్నారని చెబుతున్నారు. ఆయన సన్నిహితులు మాత్రం బుధవారం జగదీష్ మాజీ సీఎం జగన్‌ను కలుస్తారని, ఆ తర్వాతే పార్టీలో చేరికపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఈ వ్యవహారం అలజడి సృష్టిస్తోంది.

ఐతేపల్లె వద్ద ఢీకొన్న కార్లు



దెబ్బతిన్న కారు(కర్నాటక)

చంద్రగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద మంగళవారం ఉదయం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు గూడూరు ఎమ్మెల్యే సునీల్ పీఏ చంద్రకు చెందిన కారు బెంగళూరు నుంచి గూడూరుకు వెళ్లోంది. ఐతేపల్లె వద్ద ఈ కారును వెనుక వస్తున్న మరో కారు ఢీకొంది. దీంతో వెనుక కారులోని కర్నాటకకు చెందిన సీత్‌రాజ్‌కు గాయాలయ్యాయి. ముందు కారులో చంద్ర, డ్రైవ్ అబ్బులకు స్వల్ప గాయాలయ్యాయి. సీత్‌రాజ్‌ను రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దట్టమైన పొగ మంచు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన అయన ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

అదృశ్యమైన విద్యార్థినుల అప్పగింత



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికల గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన ఇద్దరు పదో తరగతి విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని జానకిరామ్‌పేటలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో పదో తరగతి చదివే ఇద్దరు విద్యార్థినులు సోమవారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమైనట్లు ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వెంకటనే పోలీసు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సోమవారం అర్ధరాత్రి డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద విద్యార్థినులు ఉండటాన్ని గుర్తించామన్నారు. మానసిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారని, వారిని తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

● ఈనెల 18 నుంచి బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల18 నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈక్రమంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రోజూ ఉదయం, రాత్రి వాహన సేవలు నిర్వహించనున్నారు. 17న అంకురార్పణ జరుగుతుంది. 18న ఉదయం మీనలగ్నంలో ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 19న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 20న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిర వాహనం, 21న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 22న ఉదయం మోహినీ అవతారంలో పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహనం, 23న ఉదయం మనుమంతు వాహనం, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రి గజ వాహనం, 24న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్ర ప్రభ వాహనం, 25న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 26న ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

తొమ్మిదవ రోజుకు వెటర్నరీ విద్యార్థుల ఆందోళన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీన్ బ్రహ్మయ్య, డీఆర్ శ్రీలత, ఏడీ జగపతిరామయ్య తదితరులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీవెటర్నరీ విద్యార్థులు చేపట్టిన సమ్మె తొమ్మిదవ రోజుకు చేరుకుంది. మంగళవారం వర్సిటీ ప్రధానగేటు వద్ద దీక్షా శిబిరంలో విద్యార్థులతో వర్సిటీ అధికారులు డాక్టర్ వీరబ్రహ్మయ్య, డాక్టర్ శ్రీలత, డాక్టర్ శోభామణి, డాక్టర్ చెంగల్వరాయులు, డాక్టర్ జగపతిరామయ్యలు మాట్లాడారు. సమ్మెని విరమించి తరగతులకు హాజరుకావాలని సూచించారు. స్టైఫండ్ పెంచేవరకు సమ్మెను విరమించబోమని విద్యార్థులు చెప్పారు.

మామిడిలో పిందె దశలో సంరక్షణ చర్యలు చేపట్టాలి



పూత దశలో ఉన్న మామిడి చెట్టు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో పిందె దశలో సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు భాస్కరయ్య మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాస్త ఆలస్యమైనా చాలా చోట్ల పూత బాగా వస్తుందన్నారు. ఈ దశలో కొత్తగా ఏర్పడుతున్న పిందెలను చీడలు ఆశించి అధికంగా రాలిపోతాయన్నారు. పిందెలు జొన్నగింజ, బఠానీ సైజులో ఉన్నప్పుడు మంగును కలుగచేసే పురుగులు, ఆకుమచ్చ తెగులు ఆశించి నష్టపరుస్తాయని చెప్పారు. ఈ చీడల నివారణకు ఫ్రిప్రోనిల్(లీటరుకు 2మి.లీ.) లేదా స్పైనోసాడ్(లీటర్‌కు 0.3మి.లీ.)తోపాటు సాఫ్(లీటర్‌కు 2.5గ్రాములు లేదా కవచ్ లీటర్‌కు 2 గ్రాములు) కలిపి స్ప్రే చేయాలన్నారు. చెట్లలో పిందెలు రాలకుండా 15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలని సూచించారు. 13-0-45(మల్టీ-కే) లీటరుకు 10గ్రాములు, యూరియా లీటరుకు 10 గ్రాములు, ఆగ్రోమిన్ మ్యాక్స్ (ఫార్ములా-4) లీటరుకు 2.5గ్రాములు కలిపి స్ప్రే చేయాలని సూచించారు. దీంతో పిందెలు రాలడం తగ్గిపోయి కాయలు పెద్దసైజులో పెరిగి అధిక దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు.

శ్రీకాళహస్తిలో త్రిశూల స్నానానికి సర్వం సిద్ధం



త్రిశూల స్నానానికి ఏర్పాటు చేస్తున్న సద్యోముక్తి ప్రదేశం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం మహోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ముందు మాఘపూర్ణిమ పురస్కరించుకుని త్రిశూల స్నాన ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ఆలయంలో బుధవారం ఉదయం 9గంటలకు పంచ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయం నుంచి స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు ఊరేగింపుగా సాగుతారు. నదిలో సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నాన ఘట్టాన్ని సద్యోముక్తి ప్రదేశంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. త్రిశూల స్నానం జరిగే సమయంలో భక్తులు పుణ్యస్నానం అచరించేందుకు పెద్దఎత్తున తరలిరానున్నారు.

జంపింగ్ రోప్ క్రీడాకారులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 9మంది జాతీయస్థాయి జంపింగ్ రోప్‌కు పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం రోటరీక్లబ్ సీనియర్ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు క్రీడాకారులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం విజయలక్ష్మి మాట్లా డుతూ తమ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు జాతీయస్థాయి జంపింగ్ రోప్ క్రీడా పోటీలకు ఎంపిక కావడంతో ఆనందంగా ఉందన్నారు. ప్రోత్సాహక నగదును విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని పలువురు కేంద్రమంత్రులు, ఎంపీలను మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీలో కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, మనసుఖ్ మండేయియా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగిని, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావుని కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అదేవిధంగా గుడిమల్లం బ్రహ్మోత్సవాలకు కూడా హాజరు కావాలని కోరారు.

చీటీల పేరుతో మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో రూ.5 కోట్లు మేర టోకరా పెట్టి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... సూళ్లూరుపేటలో పట్టణంలోని గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న కొటారు రమేష్ చీటీల నిర్వహణ పేరుతో పాత షార్ బస్టాండు వద్ద ఓ కార్యాలయాన్ని ప్రారంభించాడు. సూళ్లూరుపేటతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద చీటీలు వేయించారు. కొన్నాళ్లగా చీటీ పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా మాయమాటలు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. చీటీ పాడుకున్న వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో వారం రోజులుగా కార్యాలయం తెరవలేదు. మంగళవారం ఇళ్లు కూడా ఖాళీ చేసి ఉండడంతో మోసపోయామని తెలుసుకొన్న బాధితులు తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు.

సత్యవేడు సమస్యలు పరిష్కరించాలి

● జేసీ, సీఎండీలకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వా నెల్లూరు వద్ద తుడా పరిధిలో ఐఎంజీ లే అవుట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో ఆయనకు వినతిప్రతం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుడా పరిధిలోని ఈ లే అవుట్ ఏర్పాటు చేయడం వల్ల మధ్య తరగతి ఉద్యోగులకు, ప్రజలకు తక్కువ ధరకు ఇంటి ప్లాట్లు అందుతుందన్నారు. త్వరలో లే అవుట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లకు త్వరగా టెండర్లు ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ కె.సంతోష్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఇందుకు సీఎండీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

టూరిజం హబ్‌గా తిరుపతి: ఎమ్మెల్యే ఆరణి



బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, భానుప్రకాష్‌రెడ్డి, అధికారులు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తిరుపతిని టూరిజం హబ్‌గా అభివృద్ధి పరుస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మహాకుంభమేళా సందర్భంగా ఏపీ టూరిజం ఆధ్వర్యంలో చేపట్టిన తిరుపతి - ప్రయాగరాజ్ ప్యాకేజీ టూర్ బస్సును మంగళవారం ఉదయం అలిపిరి గరుడ కూడలి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకుంభమేళాలో భక్తులు స్నానమాచరించేందుకు సౌకర్యంగా ప్రభుత్వ పర్యాటకాభివృద్ధి సంస్థ తిరుపతి, నెల్లూరు నుంచి మహాకుంభమేళాకు ఏసీ బస్సులను అందుబాటు ధరల్లో నడపడం అభినందనీయమన్నారు. మహాకుంభమేళాలో టీటీడీ సైతం భాగస్వామ్యమై సేవలందిస్తోందని టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. డివిజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఈ నెల 17న కూడా కుంభమేళా ప్యాకేజీ టూర్ బస్సు ఏర్పాటు చేశామని, భక్తులు టిక్కెట్‌ను ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, యువరాజ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగార్జునరావు, వెంకటేశ్, మునస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులకు హెల్మెట్ల వితరణ



హెల్మెట్‌లు అందచేస్తున్న దాతలు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలలో తలకు తీవ్రగాయాలై స్పాట్‌లో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఓ దాత ద్విచక్రవాహన చోదకులకు మంగళవారం హెల్మెట్స్ వితరణ చేశారు. స్థానిక అన్నమయ్య కూడలిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వెస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ రామకృష్ణ, డాలర్ చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ సి.గెహణీరెడ్డి రోడ్డుదాటుతున్న ద్విచక్రవాహనదారులను ఆపి హెల్మెట్ లేని దాదాపు వందమందికి పంపిణీ చేశారు. ఇకపై విధిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం నడపాలని కోరారు. ప్లకార్డులు పట్టుకొని కాసేపు హెల్మెట్ ధరిద్దాం, రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం, విలువైన ప్రాణాలను కాపాడుకుందామంటూ నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించి రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌కు డిప్యూటీ మేయర్ అభినందన



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్‌సీ మునికృష్ణ

తిరుపతి/తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణ మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఎన్నికల అధికారిగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పారదర్శకంగా పనిచేశారని, తొలిరోజు కోరం లేకపోవడంతో వాయిదా వేయడం, రెండో రోజు ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించడంలో చక్కగా వ్యవహరించారన్నారు. అనంతరం టీడీపీ నేతలు జేబీ శ్రీనివాస్ నివాసంలో డిప్యూటీ మేయర్‌కు పెద్దఎత్తున సన్మానం చేశారు. అదేవిధంగా శ్రీసాయిసుధ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి ఆర్సీ మునికృష్ణను అభినందించారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని సేవాగడ్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్న సేవాలాల్ జయంతి పోస్టర్లను గిరిజన నవసమాజ్ నాయకులు ఆవిష్కరించారు. ఎస్వీయూలో ఆ సంఘం అధ్యక్షుడు శివశంకర్ నాయక్, నాయకులు చంద్రశేఖర్ నాయక్, సునీల్ నాయక్, బాబు నాయక్, న్యాయవాది మాసుమయ్య, భార్గవ్ తదితరులు మంగళవారం ఈ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని జాతీయ పండుగగా ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.50 లక్షల నిధులను సేవాలాల్ జయంతికి విడుదల చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి గిరిజనులు తరలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వైకుంఠం' డ్యూటీ చేసినవారికి జీతం వేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీవారి వైకుంఠ దర్శనాల టోకెన్ల జారీ కేంద్రాల్లో విధులు నిర్వహించిన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఎట్టకేలకు టీటీడీ అధికారులు జీతం వేశారు. టీటీడీ అధికారుల్లో సమన్వయం లేక కాంట్రాక్టు సిబ్బందికి జీతం ఇవ్వకుండా ముప్పతిప్పలు పెట్టడంపై 'వైకుంఠం' డ్యూటీ చేస్తే జీతం ఆపేశారు.. శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తపై టీటీడీ ఉన్నతాధికారులు స్పందించారు. శ్రీలక్ష్మీనారాయణ డేటా ఎంట్రీ ఆపరేటర్స్, అండ్ డేటా ప్రాసిసింగ్స్ సొసైటీ పేరిట టీటీడీలో పనిచేస్తున్న 107 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జీతాలు విడుదల చేశారు. సమన్వయ లోపానికి కారణమైన అధికారులను మందలించినట్టు తెలిసింది.

స్విమ్స్ బ్లడ్ సెంటర్‌కు ఎన్‌బీటీసీ అవార్డు



అవార్డు అందుకున్న బ్లడ్ సెంటర్ సిబ్బందిని అభినందిస్తున్న స్విమ్స్ అధికారులు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ బ్లడ్ సెంటర్ అందించిన ఉత్తమ సేవలకు గాను నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కౌన్సిల్(ఎన్‌బీటీసీ) అవార్డు అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. కేరళలోని కొచ్చిలో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన రక్తమార్పిడి సేవలపై సమీక్షా సమావేశంలో ఏపీలో అత్యంత సేవలు అందించిన స్విమ్స్ బ్లడ్ సెంటర్‌కు నేషనల్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కౌన్సిల్ ప్రతిభా అవార్డు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న బ్లడ్ సెంటర్ డాక్టర్ సురేష్‌బాబు, సీనియర్ టెక్నీషియన్ హరిప్రసాద్, ఎంఎస్‌డబ్ల్యూ శ్రీదేవిలు మంగళవారం స్విమ్స్‌లో డైరెక్టరు ఆర్వీకుమార్‌ను కలిసి ఆ ప్రతిభా అవార్డులను అందజేశారు. దీంతో ఆయన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

ఎట్టకేలకు అనుమతించారు



రేణిగుంట ప్రధాన మార్గంలో రెండు వైపులా నడుస్తున్న వాహనాలు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ప్రధాన రహదారి నారాయణాద్రి ఆస్పత్రి ఎదురుగా మరమ్మతుల నేపథ్యంలో కొంత దూరం వరకు రోడ్డు (తిరుపతి నుంచి రేణిగుంటకు వెళ్లే మార్గం)ను బ్లాక్ చేసిన విషయం తెలిసిందే. ఆ పనులు పూర్తిచేసి కూడా నెలరోజులు దాటినా వాహనాల రాకపోకలను అనుమతించలేదు. ఒకే దారిలో వాహనాల రాకపోకలతో ప్రమాదకరంగా ఉంటోంది. దాంతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ఎన్నాళిలా' అన్న శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధిత విభాగం సోమవారం నుంచి వాహనాలను అనుమతించడంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్రిప్‌ల పేరిట పెరిగిన అనధికార విద్యుత్ కోతలు

మూడు రోజులుగా మధురానగర్ ప్రాంతంలో అంధకారం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ నిర్లక్ష్యం... సబ్ స్టేషన్ల మరమ్మతులు... విద్యుత్ కేబుల్స్ డ్యామేజ్ పేరిట ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారు. గత మూడు రోజులుగా మధురానగర్, రైల్వే కాలనీ, తిరుమల బైపాస్ రోడ్డు, అబ్బన్న కాలనీ, అశోక్‌నగర్ ప్రాంతాల్లో అనధికార విద్యుత్ కోతలు పెరిగిపోతున్నాయి. గత ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో చాలీ పనులు ఆగిపోయాయి. ఇళ్లల్లో మహిళలు సైతం నానా అవస్థలు పడ్డారు. అలాగే మరుసటి రోజు సోమవారం ఉదయం అకస్మాత్తుగా విద్యుత్ కోత విధించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 7.15 గంటల నుంచి దాదాపు అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో మీడియా, పత్రికా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సైతం అవస్థలు పడ్డారు. దీనిపై మధురానగర్ విద్యుత్ ఏఈని సంప్రదించగా ట్రిప్ పేరుతో కట్ అవుతుందని చెప్పారు. మంగళవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీనిపై ఏఈ స్పందిస్తూ శ్రీదేవి కాంప్లెక్సు నుంచి బాలాజీ కాలనీ సబ్ స్టేషన్ మధ్య కేబుల్ డ్యామేజ్ కావడంతో లైన్ ట్రిప్ అయిందని అన్నారు. దీంతో భవానీ నగర్, టీటీడీ పరిపాలనా భవనం, శ్రీదేవి కాంప్లెక్సు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరపరా ఆగిపోయిందన్నారు.

బాల్యవివాహాలు చేసుకోవద్దు...

మత్తు, ఫోన్లకు బానిసకావద్దు

● షీటీం డీఎస్పీ శ్రీలత



మాట్లాడుతున్న షీటీం డీఎస్పీ శ్రీలత

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎట్టిపరిస్థితుల్లోనూ బాల్యవివాహాలు చేసుకోవద్దని, మత్తుపదార్థాలకు, సెల్‌ఫోన్లకు బానిసకావద్దని షీటీం డీఎస్పీ శ్రీలత విద్యార్థినీ, విద్యార్థులకు సూచించారు. మంగళంలోని జిల్లా పరిషత్ ఉన్నత ట్రెండ్స్ పాఠశాలలో మంగళవారం పిల్లల అలవాట్లు, బానిసలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు ఎవరు వాడుతున్నారో తెలుసుకోవడానికి త్వరలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేస్తామన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల మాయమాటలు వినవద్దని, తినుబండారాలు తీసుకోవద్దని, దగ్గర్లో ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయిస్తే తమకు తెలియజేయాలన్నారు. మత్తుకు బానిసైన పిల్లలను జువైనల్‌హోమ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ విషయంలో కూడా ఇంట్లో వారితో, బంధువులతో సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు పాఠశాలకు పోలీసులు వస్తారని, మీ సమస్యలు వారికి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దీపిక, ఏఎస్సై రోహిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవుల నాయుడు, వసుంధరదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సాధన కోసం పోరాటానికి సిద్ధం కావాలి

● అంగన్‌వాడీలకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం పోరుబాటకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో అంగన్‌వాడీలు సమస్యల సాధనకోసం 42 రోజుల పాటు సమ్మె చేశారని, అప్పట్లో టీడీపీ నాయకులు శిబిరాల వద్దకెళ్లి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు కావస్తున్నా సమ్మె కాలం వేతనాలు చెల్లించడానికి ప్రభుత్వం కాలయాపన చేయడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమ్మెకాలంలో ఇచ్చిన హామీలు, ఒప్పందం చేసిన సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రులు, ప్రజాప్రతినిధులను కలసి వినతిపత్రాలు ఇస్తున్నా నేటివరకు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వేతనాలు పెంపు ఫైలు ముఖ్యమంత్రి వద్ద ఉందని కొందరు హామీలు ఇస్తున్నారని చెప్పారు. సమస్యల సాధనకోసం కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడానికి సమావేశం తీర్మానించిందని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజుల, చంద్రశేఖర్ రెడ్డి, రాధాక్రిష్ణ, ఎన్.డి.రవి, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీబీఐసీ కోసం 985 ఎకరాలకు

రూ.78.84 కోట్ల పరిహారం

- కలెక్టర్ చొరవతో 600 మంది రైతులకు న్యాయం
- సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న వివాదానికి పరిష్కారం
- ఇటీవలి క్యాబినెట్ నిర్ణయంతో తాజాగా పరిహారం మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 2016 నుంచీ పెండింగులో ఉన్న సీబీఐసీ భూముల పరిహారం వివాదం ఎట్టకేలకు కలెక్టర్ చొరవతో పరిష్కారమైంది. దానికనుగుణంగా చిల్లకూరు, కోట మండలాల పరిధిలోని 600 మంది రైతులకు రూ.78.84 కోట్ల పరిహారం మంజూరైంది. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు 10 వేల ఎకరాలకుపైగా భూములు అవసరమయ్యాయి. వీటిని సేకరించే క్రమంలో చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం మండలాల పరిధిలోని 985.60 ఎకరాల అనాధీన భూములను కూడా ప్రభుత్వం సేకరించింది. భూములను సీబీఐసీ ప్రాజెక్టు కోసం అప్పగించినప్పటికీ వాటికి సరైన రక్షణ లేకపోవడంతో స్థానిక రైతులు వాటిని ఆక్రమించి సాగు చేసుకోవడం ప్రారంభించారు. ఇటీవల సీబీఐసీ పనులు మొదలు కావడంతో ఈ 985 ఎకరాల భూములకు సంబంధించి రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సాల్ అధ్యక్షతన ఏడుగురు అధికారులతో కమిటీ వేశారు. సీబీఐసీ ప్రాజెక్టుకు ఈ భూములు కీలకం కావడంతో ఎలాగైనా వాటిని ప్రాజెక్టుకు అప్పగించాలనే ఉద్దేశంతో కలెక్టర్ చొరవ తీసుకున్నారు. గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచీ వినతులు, ప్రతిపాదనలు స్వీకరించారు. అయితే భూములకు పరిహారం మంజూరు చేయడంలో సాంకేతికంగా చిక్కులు ఎదురయ్యాయి. ఆ భూములను 600 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. దానికి సంబంధించి రెవెన్యూ శాఖలో ఎలాంటి రికార్డులూ లేవు. రైతులకు డీకేటీ పట్టాలు జారీ కాలేదు. అడంగల్‌లో గానీ, 10(1) రికార్డుల్లో గానీ రైతుల సాగు ప్రస్తావన లేదు. దానికి తోడు సంబంధిత భూములను సీబీఐసీ ప్రాజెక్టు కోసం గతంలోనే స్వాధీనం చేసేసినట్టు భూసేకరణ రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే సీబీఐసీ ప్రాజెక్టు ప్రాధాన్యత నేపథ్యంలో ఎలాంటి ఆధారాలూ లేకపోయినా సంబంధిత 600 మంది రైతులకూ ఎకరాకు రూ.8 లక్షలు చొప్పున పరిహారం చెల్లించి భూములు సేకరించాలని కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సీఎం చంద్రబాబు సైతం సమస్య పరిష్కారానికి ఆసక్తి చూపడంతో ఈనెల 6వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 600 మంది రైతులు సాగు చేసుకుంటున్న 985 ఎకరాలకు పరిహారం చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దానికనుగుణంగా మంగళవారం ప్రభుత్వం 600 మంది రైతులకు రూ. 78.84 కోట్లు పరిహారంగా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐసీ ప్రాజెక్టు నేపథ్యంలో దీన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తున్నామని, ఇతర కేసులకు ఈ నిర్ణయం వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

శిక్షణ డ్రైవర్ల రక్తదానం



రక్తదానం చేసిన దాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీపీటీవో

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భద్రతా మాసోత్సవాల్లో భాగంగా తిరుపతి, అలిపిరి ఆర్టీసీ డిపోలలో మంగళవారం డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీటీవో నరసింహులు, మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు రక్తం చాలా అవసరమన్నారు. ఓ వ్యక్తి ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం రక్తదాతలను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డిపో మేనేజర్లు బాలాజీ, హరిబాబు, అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫెడరల్ బ్యాంకు ప్రారంభం



ఫెడరల్ బ్యాంకును ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ కుమార్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కస్టమర్ల మెరుగైన సౌలభ్యం కోసం హరేరామ హరే కృష్ణ రోడ్డులో ఉన్న ఫెడరల్ బ్యాంకును స్థానిక కేటీ రోడ్‌లోకి మార్చిన శాఖను స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఏటీఎంను ప్రముఖ గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, సేఫ్ డిపాజిట్ లాకర్స్‌ను ఆస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీధర్‌ముని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశానికి శ్రీరెడ్డి అధ్యక్షత వహించగా, అతిథులుగా భీమాస్‌గ్రూప్ కేజీ రంగనాథన్, ఇస్కాన్ మాతాజీ రాంపల్లి మీనాకుమారి హాజరయ్యారు. ఫెడరల్ బ్యాంకు డిప్యూటీ డైరెక్టర్ స్వాతిప్రియ, సీనియర్ మేనేజర్ విజయ్‌భరద్వాజ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



యోగీశ్వరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్ఐ విభాగ పరిశోధకులు వడ్లమూడి యోగీశ్వరరావు డాక్టరేట్ పొందారు. ఎస్వీయూ ఓఆర్ఐ ప్రచురించిన గ్రంథాలు - పరిశీలన అంశంపై ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీత దామ్లానాయక్ తెలిపారు.

లడ్డూ కల్తీ జరిగినట్లు

రిమాండ్ రిపోర్టులో లేదు

● టీటీడీ మాజీ చైర్మన్ భూమన వెల్లడి



మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ లడ్డూ వ్యవహారంలో సిట్ బృందం అరెస్టు చేసిన వారి రిమాండ్ రిపోర్టులో ఎక్కడా కల్తీ జరిగినట్లు ప్రస్తావించలేదని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతిలో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. నలుగురిని అరెస్టు చేసిన సిట్ అధికారులు.. బోలేబాబా, ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీల మోసాన్ని మాత్రమే రిపోర్టులో ప్రస్తావించారన్నారు. టీటీడీలో నెయ్యి కల్తీకి అవకాశమే లేదన్నారు. కల్తీ అన్నది చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆలోచనల్లో మాత్రమే ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో మేయర్ శిరీష, నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, అజయ్‌కుమార్, బొమ్మగుంట రవి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా హిందూ ధర్మ ప్రచారం చేయాలి

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా నేర్చుకున్న ప్రతి విషయాన్ని భక్తులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ కార్యక్రమం ఆస్థానమండపంలో మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఈవో మాట్లాడుతూ.. హిందూధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మెట్లోత్సవ భక్తులు మరోసారి వచ్చేటప్పుడు సహచరులను కూడా తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ.. ఒక్కసారి మెట్లోత్సవంలో పాల్గొంటే 108 సార్లు స్వామిని దర్శించుకున్న పుణ్యఫలం దక్కుతుందన్నారు. క్రమశిక్షణతో జాగ్రత్తలు పాటిస్తూ టీటీడీ సిబ్బందికి సహకరించాలని భక్తులను కోరారు. సమావేశంలో ప్రవచనకర్త హయగ్రీవచార్యులు, ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటకాకు చెందిన భజన మండలి సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, పక్కన ఆనందతీర్థాచార్యులు

టీటీడీకి విరాళంగా ద్విచక్రవాహనాలు



తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మంగళవారం రెండు ద్విచక్రవాహనాలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన టీవీఎస్, బెంగళూరుకు చెందిన డీఎస్ ఎకో సంస్థల ప్రతినిధులు ఈ విద్యుత్ ద్విచక్రవాహనాలను అందజేశారు. టీవీఎస్ ఐ క్యూబ్ ఎక్స్ వాహనం ధర రూ.2.70 లక్షలు, ఎన్‌డీఎస్ ఎకో వాహనం ధర రూ.1.56 లక్షలు అని ప్రతినిధులు తెలిపారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించాక టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి సంస్థల ప్రతినిధులు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, ఎండీ సుదర్శన్, ఎన్‌డీఎస్ ఎకో సంస్థ చైర్మన్ ఎంహెచ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హీరో కార్తీ



తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో కార్తీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కార్తీకి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం కార్తీ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో ఖైదీ-3, సర్దార్2 చిత్రాలు అభిమానుల ముందు రాబోతున్నట్టు తెలిపారు. తన కుమారుడు పుట్టిన తర్వాత తొలిసారిగా తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. హీరో కార్తీని ఆలయం ముందు చూసేందుకు పలువురు అభిమానులు పోటీ పడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారినీ కార్తిక్ దర్శించుకున్నారు. కాగా, తిరుమల శ్రీవారిని నటి భువనేశ్వరి దర్శించుకున్నారు.



ఆలయం ముందు హీరో కార్తీ - భువనేశ్వరి

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,169

తలనీలాలు సమర్పించినవారు: 24,559



చోళ కళావైభవం

మాంబట్టు కాశీవిశ్వేశ్వరాలయం

అపాచీ, శ్రీసిటీ పారిశ్రామిక ప్రాంతంలో ఉంది కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం. చోళరాజుల కాలం నాటి గుడి ఇది. ఆ పురాతన వాతావరణం ఆలయ ప్రాంగణంలో కనిపిస్తుంది. చినమాంబట్టు గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వర, అన్నపూర్ణాదేవి ఆలయంగా నిత్యపూజలందుకుంటోంది. పురాతన శిల్పాలతో నిండిన ఈ ఆలయం చిన మాంబట్టు గ్రామంలో ఉంది.

\- తడ, ఆంధ్రజ్యోతి

చరిత్ర: క్రీ.శ 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయం ఇది. ఇందుకు ఆధారమైన శాసనాలు ఉన్నాయి. తొలుత గర్భగుడి, అర్థమండపం నిర్మించారు. 13వ శతాబ్దంలో ఈ స్తంభమండపం నిర్మాణం జరిగింది. పల్లవ, చోళ శాసనాల్లో ఉన్న 'బట్టారక', పరమబట్టారక' అనే పదాలను పరిశీలిస్తే' బట్టు' అనే పదమే కాలక్రమంలో మాంబట్టు అనే ఊరి పేరుగా మారి ఉండవచ్చని భావిస్తారు.

పురాణ ప్రాశస్త్యం: ఈ గ్రామానికి చెందిన ఒక బ్రాహ్మణుడి కోరిక మేరకు చోళుల కాలంలో శివాలయాన్ని నిర్మించారు. ఆలయానికి అవసరమైన భూమిని అదే గ్రామానికి చెందిన గుంటూరు మహదేవమ్మ అందించగా, యనమండ్రం నారసింహయ్యశర్మ, వెంకటరామయ్యశర్మలు అర్చకత్వానికి సిద్ధమయ్యారు. ఆలయం అయితే పూర్తవుతుంది కానీ ప్రతిష్ఠించడానికి దేవుడు కావాలి కదా. ఈ సమయంలో కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న ఒక యాత్రీకుడు పాలరాతి శివలింగాన్ని ఇచ్చాడు. శివుడితోపాటూ అన్నపూర్ణాదేవి విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు. కాలక్రమంలో చండీకేశ్వరి, దుర్గాదేవి, కాలభైరవుడు, నందీశ్వరుడు, మహావిష్ణువు, శ్రీవల్లి, దేవసమేత సుబ్రమణేశ్వరిస్వామి విగ్రహాలతోపాటు ధ్వజస్తంభం ఏర్పాటైంది. భక్తుల కోర్కెలు తీర్చే దేవుడిగా కాశీవిశ్వేశ్వరుడికి ప్రతీతి.



మాన్యం మాయం: వెంకటగిరి రాజుల పోషణ: మాంబట్టు కాశీవిశ్వేశ్వరుడి ఆలయం వద్ద తొలుత 26 బ్రాహ్మణ కుటుంబాలు అర్చకత్వంలో ఉండేవని చెబుతారు. వీరంతా ఆ తర్వాత వలస పోవడంతో ఆలయ పూజా కైంకర్యాలకు కొదవ ఏర్పడింది. పరిస్థితి వెంకటగిరి రాజుల దృష్టికి వెళ్లింది. వారు స్వామివారికి 79.43 ఎకరాలు, అమ్మణ్ణికి పసుపు, కుంకాల రూపేణ 25 ఎకరాల మాన్యం ఇచ్చారు. దాంతోనే ఆలయ ధూపదీప, నైవేద్యాలు నడిచేవి. 2006లో ఆ భూములను పరిశ్రమలకు అప్పగించడంతో ఇప్పుడు ఆ మాన్యమూ లేకుండా పోయింది.

తగ్గని వైభవం: శిథిల స్థితికి చేరుకున్న ఆలయాన్ని గ్రామస్థులే పట్టించుకుని పూర్ణోద్ధరణకు పూనుకున్నారు. ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు 9 రోజుల పాటు జరుగుతాయి. కార్తీకమాస ఉత్సవాలు మాత్రం తెలుగు, తమిళ సాంప్రదాయాల ప్రకారం రెండు నెలలపాటు నిర్వహిస్తున్నారు రోజూ రెండు పూటలా ధూపదీప, నైవేద్యాల సమర్పణ జరుగుతుంది.. గ్రామ రైతు మన్నె శంకరయ్య విరాళంగా ఇచ్చిన స్థలంలో గ్రామస్థులంతా కలిసి అన్నదాన సత్రం నిర్మించుకున్నారు. ప్రతి పౌర్ణమికీ ఇక్కడ అన్నదానం జరుగుతుంది.





శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి పాలరాతి శివలింగం - అన్నపూర్ణాదేవి

ఆలయం శ్లాబు రాతిబండలపై చెక్కిఉన్న మత్స్యం, ఉడుము, భక్తుల శిల్పాలు ఆకారాలు





శివరాత్రి ఉత్సవాలు: అంగరంగవైభవంగా నిర్వహించేవారు. శివరాత్రిని చిన్నమాంబట్టులోని ఆలయంలో, కళ్యాణోత్సవాన్ని పెద్దమాంబట్టు ఆలయంలో, పారువేట ఉత్సవాన్ని ఎన్ఎంకండ్రి గ్రామంలో నిర్వహిస్తూ ఉండేవారు. ఆ ఆనవాయితీ నేటి కొనసాగుతూ ఉంది.

చెన్నై- బెంగళూరు కారిడార్‌కు పచ్చజెండా

● రూ.78.84 కోట్ల నష్టపరిహారం విడుదల



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేయడానికి రూ.78.84 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడర్ ప్రాజెక్టు అభివృద్ధికి కోట మండలం కొత్తపట్టణం, చిల్లకూరు మండలం తమ్మినపట్టణంలో ప్రభుత్వ భూమిలో సాగులోని రైతులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించలన్నారు. సాగులోని భూములను సర్వేచేసి, క్షేత్రస్థాయిలో నిర్ధారణ చేసుకున్న తరువాత నష్టపరిహారం పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్‌రెడ్డి, శివకుమార్,కోట, చిల్లకూరు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

17, 18న శాయ్ హాస్టల్ సెలక్షన్స్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17, 18 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్(యానం)సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ ప్లేయర్స్ ఆ రోజుల్లో ఉదయం 9గంటలకు యానం శాయ్ ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాల్సి వుంది. బ్యాడ్మింటన్‌కు 12నుంచి 18 సంవత్సరాల వయస్సు బాలురు, స్విమ్మింగ్‌కు 12నుంచి 16 సంవత్సరాల వయస్సు బాల, బాలికలు అర్హులు. జనన ధృవీకరణపత్రం, ఆధార్, ఇప్పటి వరకు పొందిన క్రీడా ప్రశంసాపత్రాలు, గవర్నమెంట్ మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సొంత స్పోర్ట్స్ కిట్ తీసుకురావాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 98662 39009 (బ్యాడ్మింటన్), 88851 76888 (స్విమ్మింగ్) నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డులాగే రైతుకు 11 అంకెలతో యూనికోడ్‌ని కేటాయించడానికి కేంద్రం నిర్ణయించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడానికే ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం భూ యజమానులకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతోందన్నారు. తొలుత పీఎం కిసాన్ లబ్ధిదారులకు.. ఆ తర్వాత మిగిలిన భూ యజమానులకు రిజిస్ట్రీ నెంబర్లు జారీ చేస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరిగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని తెలిపారు. రైతులందరూ తమపేరు, గ్రామం, ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను సమీపంలోని రైతు సేవాకేంద్రంలో సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చన్నారు. వెళ్లలేని పరిస్థితిలో ఫోన్ ద్వారా రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి వివరాలు తెలిపి ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 25వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు.

అసంఘటిత కార్మికులంతా 'ఈశ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి అసంఘటిత కార్మికుడు తన వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, సంక్షేమ పథకాలు పొందాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ-శ్రమ్ పోర్టల్‌పై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. 16-59 సంవత్సరాల వరకు కార్మికులు అర్హులన్నారు. కార్మికుడి ఆధార్‌కార్డు, ఆధార్ లింకుతో ఫోన్, బ్యాంకుఖాతా వివరాలు ఉంటే ఈ పథకంలో చేరవచ్చన్నారు.

ముక్కంటి సేవలో గాయకులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ప్రముఖ గాయకులు రమ్య బెహరా, అనురాగ్ కులకర్ణి మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వారం రోజుల్లో 41.5 కిలోల గంజాయి సీజ్

● బహిరంగ మద్యపానాలపై 913 కేసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. వారాంతపు నివేదికను మంగళవారం ఆయన మీడియాకు విడుదల చేసి మాట్లాడారు. రాత్రి, పగలు గస్తీ పెంచామన్నారు. అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న వారిపై నిఘా పెంచామన్నారు. ఈ వారం రోజుల వ్యవధిలో రాత్రి పూట రోడ్లపైన తిరుగుతున్న 165 మంది అనుమానితులను ఆయా పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై కఠినంగా వ్యవహరించి దాదాపు 41.5 కిలోలు సీజ్ చేసినట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై 913 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు వివరించారు. బహిరంగంగా మద్యం తాగే 81 ప్రాంతాలను గుర్తించి అక్కడ అవగాహన బ్యానర్లు ఏర్పాటు చేశామన్నారు. 119 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. విద్యాసంస్థలు, యూనివర్శిటీలకు సమీపంలోని బడ్డీ కొట్టులు, దుకాణాలు, కిరాణా షాపుల వద్ద ఆకస్మిక తనిఖీలు చేసి గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. పుత్తూరు, తిరుపతి, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, నాయుడుపేట, నాగలాపురం, చంద్రగిరి ప్రాంతాల్లో.. విద్యాసంస్థలకు సమీపంలో ఉన్న దుకాణాల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో పలు ప్రదేశాల్లో తనిఖీలు చేశారు.

రైలు ఢీకొని గ్యాంగ్‌మేన్ దుర్మరణం

● మరొకరికి తీవ్ర గాయాలు



ఏఆర్ అభిషేక్ (ఫైల్‌ఫొటో)

తడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో విధుల్లో ఉన్న ఓ గ్యాంగ్‌మేన్ దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తడ మండలం అనపగుంట రైల్వేగేటు సమీపంలో ఐదుగురు సభ్యులతో కూడిన గ్యాంగ్‌మెన్ మంగళవారం పట్టాలపై గేజ్ లెవల్ తనిఖీ చేపట్టారు. ఈ బృందంలోని మేస్త్రీ దగ్గరలోని గేటు వద్దకు వెళ్లి గేట్‌మ్యాన్‌తో మాట్లాడుతుండగా, మరో ఇద్దరు తాగునీటి కోసం పక్కకు వెళ్లారు. మిగిలిన ఏఆర్ అభిషేక్(30), ముంజయ్ కుమార్ పని చేస్తుండగా నాగర్ కర్నూల్ నుంచి ఎర్నాకులం వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేగంగా దూసుకొచ్చింది. దీంతో బిత్తరపోయిన ముంజయ్ కుమార్ పట్టాలపై నుంచి ఎగిరి పక్కకు దూకగా, అభిషేక్ పట్టాలు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ముంజయ్ కుమార్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన ముంజయ్ కుమార్‌ను 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతి చెందిన అభిషేక్ స్వస్థలం కేరళ రాష్ట్రం కాగా, గాయపడిన ముంజయ్ కుమార్ బీహార్‌వాసి. పట్టాలపై గ్యాంగ్‌మెన్ విధులు నిర్వహిస్తున్న సమయంలో రైళ్ల రాకపోకల సమయాన్ని తెలుసుకొంటూ సిబ్బందిని అప్రమత్తం చేయాల్సిన మేస్త్రీ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికార వర్గాలు భావిస్తున్నట్లు తెలిసింది.

సర్వలెన్స్ ప్రాజెక్ట్ ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ సర్వలెన్స్ ప్రాజెక్టు, న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గత నెల ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఫైనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలను ఎస్వీ వైద్య కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోగలరని ఆయన తెలిపారు.

పుస్తకమే పతాకం..!

● పుస్తక ప్రదర్శనపై దాడిని ఖండిస్తూ తిరుపతిలో నిరసన ర్యాలీ




తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహించిన 17వ పుస్తక ప్రదర్శనపై జరిగిన దాడి పట్ల పుస్తకాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బాలాజీ కాలనీలోని జ్యోతిబాపూలే విగ్రహం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. రామాయణం, భారతం, భాగవతం, మహాప్రస్థానం సహా ఎవరికి నచ్చిన పుస్తకాలను వారు జెండాలా చేతపట్టుకుని ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. టౌన్‌క్లబ్, ఎస్పీ ఆఫీస్, ప్రకాశం రోడ్డు, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం కూడలి, గాంధీ రోడ్డు మీదుగా నాలుగుకాళ్ల మండపం దాకా ర్యాలీ సాగింది. 'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ', 'పుస్తకాలు జ్ఞాన నేత్రాలు, పుస్తకాలను చింపినంత మాత్రాన, పుస్తకాల్లోని భావాలను చంపలేరు' అంటూ నినదించారు. ర్యాలీలో భాగంగా తిరుపతి గాంధీరోడ్డులో గల విశాలాంధ్ర బుక్ హౌస్ ఎదురుగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. నాలుగు కాళ్ల మండపం వద్ద నిలబడి నిరసన తెలిపారు. పుస్తకప్రియులను ఉద్దేశించి పలువురు రచయితలు, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు. ఏ పుస్తకాలు చదవాలో, ఏ పుస్తకాలు చదవకూడదో నిర్ణయించడానికి ఎవరికీ హక్కు లేదని స్పష్టం చేశారు. పుస్తక ప్రదర్శనలోని ఒక స్టాల్ నుంచి పుస్తకాన్ని లాక్కొని, చించి పోగులు పెట్టి, దహనం చేయడానికి ప్రయత్నించిన దుండుగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాలాంధ్ర బుక్ స్టాల్‌పైనా దాడి చేసి స్వాతంత్ర్య సమరయోధుడు పెరియార్ పుస్తకాలు అమ్మరాదని ఆదేశించి, తీసేయించడం దారుణమన్నారు.

ఈ సందర్భంగా తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తకాలపై దాడి హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎస్వీయూ ఇంగ్లీషు రిటైర్డు ప్రొఫెసర్ మధురాంతకం నరేంద్ర, డాక్టర్ కడియాల వెంకటరమణ (అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు), సీనియర్ జర్నలిస్టు ఆలూరి రాఘవ, రచయితలు ఆర్ఎం ఉమామహేశ్వరరావు, మూరిశెట్టి గోవిందు, పేరూరు బాలసుబ్రమణ్యం, గొడుగుచింత గోవిందయ్య, నాగులూరు దయాకర్ పాల్గొన్నారు. ఇంకా నిర్మల, రెడ్డెప్ప (జన విజ్ఞాన వేదిక), వెంకటరమణ (సాహితీ స్రవంతి), మల్లారపు నాగార్జున (వేమన విజ్ఞాన కేంద్రం), నడ్డి నారాయణ (బాలోత్సవం), పరమేశ్వరరావు (పౌర చైతన్య వేదిక), సాకం నాగరాజ (జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు), యువశ్రీ మురళి (అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు), నెమిలేటి కిట్టన్న (అరసం జిల్లా కార్యదర్శి), తమటం రామచంద్రారెడ్డి (తెలుగు భాషోద్యమ సమితి),కందారపు మురళి (సీఐటీయూ), డాక్టర్ పి.సాయిలక్ష్మి (ఐద్వా జిల్లా కార్యదర్శి), లక్ష్మి (ఎస్‌యూసీఐ), వందవాసి నాగరాజు (సీపీఎం జిల్లా కార్యదర్శి), రామా నాయుడు (సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు), అంజయ్య (దళిత సాహిత్య వికాస వేదిక), వెంకటరత్నం (సీనియర్ కమ్యూనిస్టు నేత), ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, బీసీ సంఘర్షణ సమితి నేత లక్ష్మయ్య, యమలా సుదర్శన్ (దళిత శంఖారావం పత్రిక ఎడిటర్), జర్నలిస్టు సంఘం నాయకుడు ప్రసాద్, మస్తానమ్మ (శంకరంబాడి సాహిత్య పీఠం) తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ రైతు పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ లక్ష్మీవిలాసపురం గ్రామానికి చెందిన వై.చిట్టిబాబు(50)కు ఒకటిన్నర ఎకరా ఉంది. వరి, వేరుశనగ, చిక్కుడు తోట సాగుచేశారు. వచ్చిన కాస్త దిగుబడి గత తుఫాను వల్ల నష్టపోయారు. సాగుకు బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్ద సుమారు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారమైంది. అప్పు తీర్చే మార్గం కనిపించక సోమవారం మధ్యాహ్నం తన పొలంలో పురుగుల మందు తాగి పడిపోయారు. స్థానికులు గుర్తించి 108లో నగరి ఏరియా ఆస్పత్రికి.. అక్కడ్నుంచి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య సఖిల, పిల్లలు కార్తీక్, ఆశ ఉన్నారు.



చిట్టిబాబు (ఫైల్ ఫొటో)

భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చి ఆత్మహత్య



మృతి చెందిన సుజాత

రేణిగుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భర్త హత్య కేసులో బెయిల్‌పై వచ్చిన భార్య మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రేణిగుంట మండలం కొత్రమంగళంలో చోటుచేసుకుంది. చెంగారెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన కె.సుజాత(37), ఈశ్వరయ్య దంపతులు. నిత్యం మద్యంతాగొచ్చి అనుమానంతో భార్యను వేధించేవాడు. గతేడాది అక్టోబరు 23న దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఆ గొడవలో భర్త తలపై బలంగా కొట్టడంతో అతడు మృతిచెందాడు. ఈ హత్య కేసులో రిమాండ్‌లో ఉన్న సుజాత పది రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైంది. ఇంటికి రాగా, పిల్లలు ఆమెను దూరం పెట్టారు. గ్రామంలోనూ ఎవరూ పలకరించలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె.. కొత్రమంగళం హరిజనవాడలోని అంగన్వాడీ టీచర్ అయిన తన కోడలి ఇంటికి చేరింది. సోమవారం రాత్రి పాత పంచాయతీ భవనంలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్ రేడియోలాజికల్ ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులకు వాక్ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో అడహక్ బేసిస్ కన్సాలిడేటెడ్ ప్రాతిప్రదికన రేడియోలాజికల్ ఫిజిక్స్(మెడికల్ ఫిజిసిస్ట్) లెక్చరర్ పోస్టులకు ఈ నెల 19న వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. రిజర్వేషన్ కింద ఎస్టీ 1, బీసీ-బి 1, ఈడబ్ల్యూఎస్ 1, ఓసీ 1 కింద ఈ నాలుగు పోస్టులకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. 42 ఏళ్ల లోపు వారు అర్హులని.. ఎంపికైన వారికి నెలకు రూ.61 వేల వేతనం ఉంటుందని ఆమె వివరించారు. వీటికి హిందూ మతానికి చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19న పాత డైరెక్టరు కార్యాలయంలో నిర్వహించే వాక్ఇన్ ఇంటర్వ్యూకు అన్నీ ధృవీకరణ పత్రాలతో హాజరుకాగలరని ఆమె వివరించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడగలరన్నారు.

ఎర్రచందనం రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు

● కింది కోర్టు తీర్పునే ఖరారు చేసిన ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పుచెప్పారు. దీనికి సంబంధించి ఫారెస్టు అధికారి, కోర్టు సహాయ లైజన్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా తిరుపత్తూరుకు చెందిన స్వామినాథన్ అన్నామలై 2014లో శేషాచలం నుంచి చంద్రగిరి మండలం నడింపల్లి బస్టాపు వద్దకు స్మగ్లర్లు తీసుకొచ్చిన 292 కిలోల బరువు కల తొమ్మిది ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలించడానికి వాహనంలో ఎక్కిస్తున్నాడు. అటవీశాఖ అధికారులు పట్టుకుని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి 2018లో ఏడాది జైలు శిక్ష, రూ 10,000 జరిమానా విధించారు. దీనిపై నిందితుడు తిరుపతి ఎర్రచందనం సెషన్స్ కోర్టుకు వెళ్లారు. కింది కోర్టు తీర్పును యథావిధిగా అమలు చేయాలని ఎర్రచందనం సెషన్స్ కోర్టు అదనపు జిల్లా న్యాయమూర్తి నరసింహమూర్తి ఆదేశించారు. ఈ కేసులో స్పెషల్ పీపీ కోటేశ్వరరెడ్డి వాదనలు వినిపించారు. లైజన్ అధికారులుగా జె.చంద్రశేఖర రాజు, సహాయ లైజన్ అధికారులుగా వెంకటేశ్వర్లు వ్యవహరించారు.

స్వర్ణముఖి బ్యారేజీ ఎత్తు పెంపు కలేనా!

వాకాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీరప్రాంత మండలాలైన వాకాడు, కోట పరిధిలో వంటల సాగుకు స్వర్ణముఖి బ్యారేజీ ప్రధాన ఆధారం. వాకాడు మండలంలోని కల్లూరు, తూపిలి, నెలిపూడి, ముట్టెంబాక, దుర్గవరం, కొడవాక, తిరుమూరు, చీమలపాడు, దుగరాజపట్నం, కోట మండలంలోని పుచ్చలపల్లి చెరువుల పరిధిలో 9,700 ఎకరాల ఆయకట్టుకు బ్యారేజీ నుంచి సాగునీరు అందుతోంది. 2005లో రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ బ్యారేజీ, చెరువులు, కాలువల పనులను 2008లో పూర్తి చేశారు. అప్పట్లో 0.035 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజీని నిర్మించారు. అయితే ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసే వర్షాలతో పోటెత్తే వరద నీటిని నిల్వచేసుకునే అవకాశం లేకపోవడంతో సముద్రంలోకి వదిలేయాల్సి వస్తోంది. ఇలా దీంతో ఏటా లక్ష క్యూసెక్కుల వరదనీరు సముద్రంలో కలుస్తోంది. ఈ నేపథ్యంలో 3 టీఎంసీల నీటిని అదనంగా నిల్వ చేసేలా బ్యారేజీ ఎత్తు ఒకమీటర్ అడుగు పెంచుతామని 2019లో ఎన్నికల సందర్భంగా వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే లేకపోవడంతో వరద నీరు సముద్రం పాలవుతోంది. పైగా బ్యారేజీకి కనీస మరమ్మతులు చేయకపోవడంతో 34 గేట్లలో 20కి పైగానే తుప్పపట్టి ట్రిలేలు తెగిపోయే పరిస్థితి ఏర్పడటంతో నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తోంది. బ్యారేజీ ఎత్తును పెంచినట్లయితే వరద నీటిని నిల్వ చేసుకుని వినియోగించుకోవచ్చు. దీంతో వాకాడు, కోటతో



పాటు చిట్టమూరు మండలంలోని భూములకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని బ్యారేజీ ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్యను వివరణ కోరగా బ్యారేజీ మరమ్మతులు, చెరువులు, కాలువల అభివృద్ధి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని చెప్పారు.

అదృశ్యమైన విద్యార్థినుల అప్పగింత


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికల గురుకుల పాఠశాల నుంచి అదృశ్యమైన ఇద్దరు పదో తరగతి విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని జానకిరామ్‌పేటలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహంలో పదో తరగతి చదివే ఇద్దరు విద్యార్థినులు సోమవారం మధ్యాహ్నం నుంచి అదృశ్యమైనట్టు ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వెంకటనే పోలీసు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. సోమవారం అర్ధరాత్రి దక్కిలి మండలం శ్రీపురం గ్రామంలోని బంధువుల ఇంటి వద్ద విద్యార్థినులు ఉండటాన్ని గుర్తించామన్నారు. మానసిక ఒత్తిడి కారణంగా విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారని, వారిని తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం

న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో రూ.5 కోట్లు మేర బోకా పెట్టి పారిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు... సూళ్లూరుపేటలో పట్టణంలోని గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న కొటారు రమేష్ చీటీల నిర్వహణ పేరుతో పాత షార్ బస్టాండు వద్ద ఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. సూళ్లూరుపేటతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురి వద్ద చీటీలు వేయించారు. కొన్నాళ్లుగా చీటీ పాడుకున్న వారికి నగదు ఇవ్వకుండా మాయమాటలు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. చీటీ పాడుకున్న వారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో వారం రోజులుగా కార్యాలయం తెరవలేదు. మంగళవారం ఇళ్లు కూడా ఖాళీ చేసి ఉండటంతో మోసపోయామని తెలుసుకొన్న బాధితులు తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

బాలాయపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం బాలాయపల్లి మండలంలోని కయ్యూరు చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చెరువుల్లో చేపల పెంపకం వంటి వృత్తుల ఆర్థిక పరిపుష్టిని పెంపుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు, కయ్యూరు చెరువు ఆయకట్టు సొసైటీ అధ్యక్షుడు రాయ మస్తాన్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, రాయి సత్యం నాయుడు, మల్లెమాల గోపీకృష్ణా రెడ్డి, బద్దెలేటి కళ్యాణ్‌రెడ్డి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, శేఖర్, సీనీ నాయుడు, దాసరి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌కు విశేష స్పందన


క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కేవీబీపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్మైల్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరె, సదాశివపురం గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్మైల్స్ వైద్య సిబ్బంది క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేవీబీపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు కుమార్, వాణి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సర్పంచ్ రామ్మోహన్‌వర్మ, నాయకులు చంద్రశేఖర్, రవి మనోహర్, ఎంపీహెచ్‌ఏ రవిచంద్రరాజు, స్థానిక వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి ఆక్రమణలు కాకుండా కాపాడేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తొట్టంబేడు మండలం శివనాథపాళెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో తహసీల్దారు మధుసూదన్ రావు సిబ్బందితో కలిసి హెచ్చరిక బోర్డును అమర్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ శివనాథపాళెం గ్రామ సర్వే నెంబరు 149/1, 149/2లోని భూమి ప్రభుత్వానికి చెందినదన్నారు. కొందరి ఆక్రమార్కులు కన్ను దీనిపై పడినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో ఈ భూమిపై ఎలాంటి క్రయ విక్రయాలు జరగకుండా సూచికబోర్డును ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. అలాగే తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం సర్వే నెంబరు 89లో ఉన్న ప్రభుత్వ భూమిలోనూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

అందరి సహకారంతోనే ట్రాఫిక్ నియంత్రణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సహకారంతోనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ వ్యాప్తంగా నో ఎంట్రీ, వన్‌వే, నోపార్కింగ్ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ దావూద్ తెలిపారు. విద్యార్థులు మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు

ఓజిలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తుండడంతో తహసీల్దారు పద్మావతి స్పందించారు. మంగళవారం వీఆర్వోలకు పలు సూచనలు ఇచ్చారు. బంజరు, ప్రభుత్వ, అనాధీనం భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని ఆదేశించారు. భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హెచ్చరించారు.

దుకాణాల్లో తనిఖీలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారిణి నర్మద తనిఖీలు నిర్వహించారు. కాలం చెల్లిన తినుబండారాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీబీఐసీ కోసం 985 ఎకరాలకు

రూ.78.84 కోట్ల పరిహారం

- కలెక్టర్ చొరవతో 600 మంది రైతులకు న్యాయం
- సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న వివాదానికి పరిష్కారం
- ఇటీవలి క్యాబినెట్ నిర్ణయంతో తాజాగా పరిహారం మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 2016 నుంచి పెండింగులో ఉన్న సీబీఐసీ భూముల పరిహారం వివాదం ఎట్టకేలకు కలెక్టర్ చొరవతో పరిష్కారమైంది. దానికనుగుణంగా చిల్లకూరు, కోట మండలాల పరిధిలోని 600 మంది రైతులకు రూ.78.84 కోట్ల పరిహారం మంజూరైంది. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు 10 వేల ఎకరాలకుపైగా భూములు అవసరమయ్యాయి. వీటిని సేకరించే క్రమంలో చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం మండలాల పరిధిలోని 985.60 ఎకరాల అనాధీన భూములను కూడా ప్రభుత్వం సేకరించింది. భూములను సీబీఐసీ ప్రాజెక్టు కోసం అప్పగించినప్పటికీ వాటికి సరైన రక్షణ లేకపోవడంతో స్థానిక రైతులు వాటిని ఆక్రమించి సాగు చేసుకోవడం ప్రారంభించారు. ఇటీవల సీబీఐసీ పనులు మొదలు కావడంతో ఈ 985 ఎకరాల భూములకు సంబంధించి రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సాల్ అధ్యక్షతన ఏడుగురు అధికారులతో కమిటీ వేశారు. సీబీఐసీ ప్రాజెక్టుకు ఈ భూములు కీలకం కావడంతో ఎలాగైనా వాటిని ప్రాజెక్టుకు అప్పగించాలనే ఉద్దేశంతో కలెక్టర్ చొరవ తీసుకున్నారు. గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి వినతులు, ప్రతిపాదనలు స్వీకరించారు. అయితే భూములకు పరిహారం మంజూరు చేయడంలో సాంకేతికంగా చిక్కులు ఎదురయ్యాయి. ఆ భూముల్లో 600 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. దానికి సంబంధించి రెవెన్యూ శాఖలో ఎలాంటి రికార్డులూ లేవు. రైతులకు డీకేటీ పట్టాలు జారీ కాలేదు. అడంగల్‌లో గానీ, 10 (1) రికార్డుల్లో గానీ రైతుల సాగు ప్రస్తావన లేదు. దానికి తోడు సంబంధిత భూములను సీబీఐసీ ప్రాజెక్టు కోసం గతంలోనే స్వాధీనం చేసేసినట్లు భూసేకరణ రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే సీబీఐసీ ప్రాజెక్టు ప్రాధాన్యత నేపథ్యంలో ఎలాంటి ఆధారాలూ లేకపోయినా సంబంధిత 600 మంది రైతులకు ఎకరాకు రూ.8 లక్షలు చొప్పున పరిహారం చెల్లించి భూములు సేకరించాలని కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సీఎం చంద్రబాబు సైతం సమస్య పరిష్కారానికి ఆసక్తి చూపడంతో ఈనెల 6న తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 600 మంది రైతులు సాగు చేసుకుంటున్న 985 ఎకరాలకు పరిహారం చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దాని కనుగుణంగా మంగళవారం ప్రభుత్వం 600 మంది రైతులకు రూ. 78.84 కోట్లు పరిహారంగా మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐసీ ప్రాజెక్టులో దీన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తున్నామని, ఇతర కేసులకు ఈ నిర్ణయం వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి


వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోవాలని ఎస్ఐ శివశంకర్ వాహనదారులకు సూచించారు. మంగళవారం రాపూరు - వెంకటగిరి మార్గంలో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా విధిస్తామని, రెండో సారి పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతేకాకుండా సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా సీజ్ చేస్తామని ఎస్ఐ అన్నారు.

ప్రతి రైతూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బాలాయపల్లి, నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నాయుడుపేట వ్యవసాయ అధికారిణి కీర్తి, బాలాయపల్లి వ్యవసాయశాఖ అధికారి గణేష్ కోరారు. రైతులు తమ పాస్ పుస్తకాలు, ఆధార్ నంబరుతో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకుంటే గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందన్నారు. గుర్తింపు సంఖ్య లేకుండా రైతులకు పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్ట పరిహారం, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు తదితర పథకాలు అందవన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, పక్కన అధ్యాపకులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని డీఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌వీ శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల పోటీ పరీక్షలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ వి.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ రాజా, సునీత, ఏడుకొండలు, అమ్మాజీ, ఉషారాణి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌తో గుండెకు భరోసా


గుండెకు భరోసా పత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రూప, వైద్యాధికారులు

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టెనెక్టిప్లస్ ఇంజక్షన్‌తో గుండెకు భరోసా లభిస్తుందని వైద్యాధికారిణి రూప తెలిపారు. కోటలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం గుండెకు భరోసా కార్యక్రమం జరిగింది. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ రూప ఆధ్వర్యంలో గుండె వ్యాధులు, వాటి లక్షణాలు, అత్యవసర చికిత్స వంటి విషయాలు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రూప, రాజశేఖర్, మాధూరి మాట్లాడుతూ గుండెపోటు బారినపడిన వారికి వెంటనే టెనెక్టిప్లస్ ఇంజక్షన్ ఇస్తే ప్రాణాలను రక్షించవచ్చన్నారు. రూ.45వేల విలువ చేసే ఈ ఇంజక్షన్‌ను ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఛాతిలో నొప్పి, ఎడమ వైపు భుజం లాగడం, ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కన్పిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లితే టెనెక్టిప్లస్ ఇంజక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

నేత్రదానం


వల్లెమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆర్యా భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన సూళ్లూరు వల్లెమ్మ(67) మంగళవారం మృతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎం.ఎం.చంద్రబాబు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలో వ్యభిచారం జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం పోలీసులు ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు విటులు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ మహిళతో పాటు మరో ఇద్దరు పురుషులపై కేసు నమోదు చేశారు.

సర్వేలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వేణు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వ సర్వేలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మండలంలోని 21 పంచాయతీల్లో సంక్షేమ పథకాలపై జరుగుతున్న ఇంటింటి సర్వేపై ఆరా తీశారు. కొన్ని పంచాయతీల్లో సర్వేల నిర్వహణలో జాప్యం జరుగుతుండటంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీల వారీగా సర్వేను వేగవంతం చేయాలని, లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరు చోరీ



గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్నూరు గ్రామంలో మంగళవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు పంట పొలాలకు విద్యుత్ సరఫరా అందజేసే రెండు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను ఎత్తుకెళ్లారు.

మెట్ట చెరువుల్లోకి చేరిన గంగనీరు

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కండలేరు నుంచి విడుదల చేసిన తెలుగుగంగ జలాలు మంగళవారం కోట మండలంలోని మెట్ట చెరువుల్లోకి చేరాయి. ఏఈ నిరంజన్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులు 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కుల నీటిని మండలంలోని కేశవరం, రామాపురం, చిల్లకూరు మండలం తొణుకుమాల చెరువుల్లోకి సోమవారం వదిలారు.

మతిస్థిమితంలేని వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా చెరువులో దిగి నీటిలో వ్యక్తిని ఒకటో పట్టణ పోలీసులు పరిరయ ఆస్పత్రికి తరలించారు. గత రెండు రోజులుగా ఓ వ్యక్తి మతిస్థిమితం లేకుండా స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని చెరువులో నీటిలో ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మతిస్థిమితం లేని వ్యక్తిని పోలీసులు చెరువులో నుంచి బయటకు తీసుకువచ్చి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఐతేపల్లె వద్ద ఢీకొన్న కార్లు

చంద్రగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద మంగళవారం ఉదయం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు గూడూరు ఎమ్మెల్యే సునీల్ పీఏ చంద్రకు చెందిన కారు బెంగళూరు నుంచి గూడూరుకు వెళ్తోంది. ఐతేపల్లె వద్ద ఈ కారును వెనుక వస్తున్న మరో కారు ఢీకొంది. దీంతో వెనుక కారులోని కర్ణాటకకు చెందిన సీతారామ్ గాయాలయ్యాయి. ముందు కారులో చంద్ర, డ్రైవ్ అబ్బులకు స్వల్ప గాయాలయ్యాయి. సీతారామ్‌ను రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. దట్టమైన పొగ మంచు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

పాఠశాల ఆటస్థలంలో గడ్డి మోపులు



తడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తడ మండలం వెండ్లూరుపాడు ప్రాథమిక పాఠశాల ఆటస్థలం గడ్డిమోపుల నిల్వ కేంద్రంగా మారింది. మొదటి విడత నాడు - నేడు పథకం కింద పాఠశాల ఆవరణలో ఆట స్థలాన్ని ఏర్పాటు చేశారు. మినీపోయ్యేలా ఉండే ఈ స్థలానికి ప్రహరీ లేక పోవడంతో స్థానికులు కొందరు గడ్డిమోపులు నిల్వ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆట స్థలాన్ని పిల్లలకు ఉపయోగపడేలా తీసుకురావాల్సిన అవసరం ఉంది.

పుస్తక పఠనంతో విజ్ఞానం


గ్రంథాలయ ప్రారంభోత్సవంలో ఆనం అరుణమ్మ తదితరులు

గూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఉమ్మడి నెల్లూరు జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. మంగళవారం గూడూరు మండలంలోని చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జొన్నా మోహనకృష్ణ, సునీతాదేవి దాతృత్వంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా అనేక కొత్త విషయాలను తెలుసుకుని జ్ఞానాన్ని పెంచుకోవచ్చున్నారు. దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సనత్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు యామిని, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లను పక్కాగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మస్తానయ్య

కోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలాల వారీగా స్కూల్ కాంప్లెక్స్ రివ్యూ సమావేశాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ సూచనలమేరకు ఎంఈవో మస్తానయ్య కోట మండలంలో ఇప్పటి వరకు ఉన్న 6 స్కూల్ కాంప్లెక్సులను 4కు కుదించారు. కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు విద్దేటు, గోవిందపల్లి, ఉన్నత పాఠశాలలను నూతన స్కూల్ కాంప్లెక్సులుగా ఏర్పాటు చేశారు. ఆయా కాంప్లెక్స్ హెచ్‌ఎంతో నెలకొకసారి జరిగే రివ్యూ సమావేశాల్లో జరిపి విద్యార్థుల్లో మెరుగైన చర్యలు నిర్వహించాలని కోరారు. విద్యా బోధనలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనాంశాల మార్పులపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సూచించారు.

18 నుంచి కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల18 నుంచి 26 వరకు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రోజూ ఉదయం, రాత్రి వాహన సేవలు నిర్వహిస్తారు. 17న అంకురార్పణ జరుగుతుంది. 18న ఉదయం మీనలగ్నంలో ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 19న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 20న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, 21న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 22న ఉదయం మోహినీ అవతారంలో పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహనం, 23న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణ రథోత్సవం, రాత్రి గజ వాహనం, 24న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్ర ప్రభ వాహనం, 25న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనంలో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 26న ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మామిడిలో పిందె దశలో సంరక్షణ చర్యలు చేపట్టాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లి), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో పిందె దశలో సంరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం, జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ మెరుగు బాస్కరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాస్త ఆలస్యమైనా చాలా చోట్ల పూత బాగా వస్తుందన్నారు. ఈ దశలో కొత్తగా ఏర్పడుతున్న పిందెలను చీడలు ఆశించి అధికంగా రాలిపోతుందన్నారు. పిందెలు ఏర్పడ్డాక మొక్కజొన్న గింజ, బఠానీ సైజులో ఉన్న పుడు మంగును అరికట్టేందుకు పురుగులు, ఆకుమచ్చ తెగులు ఆశించి నష్టపరుస్తాయని చెప్పారు. ఈ చీడల నివారణకు ప్రొఫెనోఫాస్(లీటరుకు 2మి.లీ.) లేదా థయోమిథాక్సామ్(లీటరుకు 0.3మి.లీ.)తోపాటు సాఫ్(లీటరుకు 2.5గ్రాములు లేదా కవచ్ లీటరుకు 2 గ్రాములు) కలిపి స్ప్రే చేయాలన్నారు. చెట్లలో పిందెలు రాలకుండా 15 రోజులకు ఒకసారి నీరు పెట్టాలని సూచించారు. 13-0-45(మల్టీ-కే) లీటరుకు 10గ్రాములు, యూరియా లీటరుకు 10 గ్రాములు, ఆగ్రోమిన్ మ్యాక్స్ (ఫార్ములా-4) లీటరుకు 2.5గ్రాములు కలిపి స్ప్రే చేయాలని సూచించారు. దీంతో పిందెలు రాలడం తగ్గిపోయి కాయలు పెద్దసైజులో పెరిగి అధిక దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు.


పూత దశలో ఉన్న మామిడి చెట్టు

పుత్తూరు వార్తలు

ఎందుకో...ఏమో !



- వైసీపీలో గాలి జగదీష్ చేరిక వాయిదా
- కారణాలపై రకరకాల ఊహాగానాలు, ప్రచారాలు

నగరి/పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా వైసీపీలో కలకలం రేగింది. మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు చిన్న కుమారుడు గాలి జగదీష్ నేడు వైసీపీలో చేరాల్సి వుండగా హఠాత్తుగా చేరిక వాయిదా పడింది.ఏ రాజకీయ పార్టీలోనూ లేకుండా అడపాదడపా నియోజకవర్గంలో పర్యటించి వెళుతున్న గాలి జగదీష్ బుధవారం తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం ఉదయాన్నే అనుచరులతో కలసి విజయవాడ బయల్దేరి వెళ్ళారు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ బుధవారం పార్టీలో చేరే కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలిసింది. ఆయన వైసీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు, ఆ మేరకు విజయవాడ బయల్దేరి వెళ్ళినట్టు, తీరా వెళ్ళాక చేరిక వాయిదా వేసుకున్నట్టు తెలియడంతో నగరి నియోజకవర్గ రాజకీయాల్లో దీనిపై జోరుగా చర్చ నడుస్తోంది. మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు మరణం తర్వాత కుటుంబంలో ఆయన కుమారులు గాలి భానుప్రకాష్, గాలి జగదీష్ ఎవరికి వారుగా వ్యవహరిస్తున్నారు.రాజకీయంగా ఎడమొహం పెడమొహంగా వుంటున్నారు. 2019 ఎన్నికల్లో నగరి నియోజకవర్గంలో గాలి భానుప్రకాష్ గెలుపునకు సోదరుడు సహకరించలేదన్న ప్రచారం జరిగింది. అలాగే 2024 ఎన్నికల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అప్పట్లోనే వైసీపీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదని తెలిసింది. గత ఎన్నికల నాటికి మాజీ మంత్రి రోజా రాజకీయంగా బలంగా వుండడం, అధిష్ఠానంలో పలుకుబడి కలిగివుండడంతో గాలి జగదీష్‌కు ప్రాధాన్యత లభించే పరిస్థితి కనిపించలేదు. అయితే గతేడాది ఎన్నికల తర్వాత పరిస్థితి మారింది. రోజా ఓడిపోవడంతో పాటు నియోజకవర్గానికి దూరమైనట్టుగా కనిపిస్తోంది. దానికితోడు వైసీపీలోనే ఆమెను వ్యతిరేకించే వర్గాలు బలంగా వున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని సన్నిహితులు కొందరు జగదీష్‌ను వైసీపీలో చేర్చేందుకు తెర వెనుక సన్నాహాలు చేసినట్టు సమాచారం. బుధవారం తాడేపల్లిలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ముందస్తుగా జగదీష్ నియోజకవర్గవ్యాప్తంగా సన్నిహితులు, అనుచరులతో పాటు మాజీ మంత్రి రోజా వ్యతిరేక వర్గాన్ని కూడా కలసి తన చేరికకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరినట్టు సమాచారం. ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుని మంగళవారం మధ్యాహ్నానికి ఆయన విజయవాడ చేరారని, గంటల వ్యవధిలో ఏమి జరిగిందో గానీ బుధవారం చేరిక కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు ఆయన సన్నిహితుల ద్వారా తెలిసింది. దీంతో నియోజక వర్గంలో రకరకాల ఊహాగానాలు ప్రచారమవుతున్నాయి. కొందరు మాజీ మంత్రి రోజా ఆయన చేరికను అడ్డుకున్నారని చెబుతుండగా మరికొందరు చేరిన తర్వాత పార్టీలో తగిన ప్రాధాన్యత వుంటుందో వుండదోనన్న అనుమానం జగదీష్ వర్గీయులకు రావడంతో వాయిదా వేసుకున్నారని చెబుతున్నారు. ఆయన సన్నిహితులు మాత్రం బుధవారం జగదీష్ మాజీ సీఎం జగన్‌ను కలుస్తారని, ఆ తర్వాతే పార్టీలో చేరికపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. మొత్తం మీద ఈ వ్యవహారం నియోజకవర్గంలో అలజడి సృష్టిస్తోంది.

వంద రోజుల పనికల్పించండి : డ్వామా పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికీ వంద రోజుల పనికల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళ వారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మండలానికి 9 కోట్ల నిధులు మంజూరు చేసినా కేవలం 14 పంచాయితీలలో 420 పనులు మాత్రమే చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలు చేసిన పనులకు వారం రోజుల్లో బిల్లులు చెల్లించాలని సూచించారు. ప్రతి పంచాయితీలోను 300 పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం తనిఖీలో భాగంగా రూ.1705 రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా తడుకు పంచాయితీ సచివాయల భవనానికి పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ బొబ్బలియాదవ్ కోరగా, జడ్పీ నిధుల నుంచి తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీడీ సరిత, ఎంపీడీవో రమేష్‌బాబు, ఏపీఎం భార్గవి, విజిలెన్స్ అధికారి శివయ్య, ఏపీడీ చంద్రశేఖర్ రాజు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



తడుకులో పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేసుకుని ఫలితాలకు అనుగుణంగా పంట సాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించ వచ్చని ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎంవీఎస్ నాయుడు తెలిపారు. మంగళ వారం పుత్తూరు మండలం తడుకు గ్రామంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని పరమేశ్వర మంగళం, నందిమంగళం, నేషనూరు, కేబీఆర్ పురం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఏడీఏ రమేరాజు, ఏవో కోదండయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది లావణ్య, తరుణ్‌కుమార్, మురళి, మోహన్‌దయాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కార్డు కోసం నమోదు చేసుకోండి

వడమాలపేట ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు అందజేస్తున్నట్లు ఏవో విజయకుమార్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులందరూ రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డులో గుంతల పూడ్చివేత



రేణిగుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణం లోని వంతెన వద్ద ఏర్పడిన గుంతలతో నిత్యం ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఈ విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు రెండు మూడు సార్లు ఈ గుంతలను మట్టి, కంకరతో కలిపిన సిమెంటుతో పలుమార్లు పూడ్చారు. అయినా భారీ వాహనాల రాకపోకలతో అదేప్రాంతంలో మళ్లీ గుంతలు పడేవి. ఈ క్రమంలో సర్పంచ్ నగేశం వంతెన వద్ద ఇరువైపులా ఏర్పడిన గోతులను కంకరవేసి తారుతో పూడ్చివేత పనులు మంగళవారం చేపట్టారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది దగ్గరుండి పనులను పర్య వేక్షించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి రైతూ గుర్తింపు కార్డు తీసుకోండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ విశిష్ట గుర్తింపు కోసం నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి గౌరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఒక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నాయని వివరించారు. రైతులు ఆధార్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబరు వివరాలను రైతు సేవా కేంద్రంలో ఉన్న సిబ్బందికి ఇచ్చి నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఒక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందవచ్చని తెలిపారు. ఈ నెల 28వ తేదీ లోపు ప్రతి రైతు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే పంట బీమా, పీఎం కిసాన్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యంత్రాలపై రాయితీ, ఇతర ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు.

కేవీబీపురం: మండలంలోని రైతులందరూ రైతు విశిష్ట గుర్తింపు కార్డులను పొందాలని వ్యవసాయాధికారి కృష్ణకుమార్ తెలియజేశారు. రైతులు మీసేవా కేంద్రంలో కాని ఆర్‌బీకేలో కాని సంప్రదించాలని కోరారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

బృందావనాలను వినియోగంలోకి తీసుకురండి



సత్యవేడులో బృందావనాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

సత్యవేడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నిరుపయోగంగా మారిన బృందావనాలు (చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు)ను తిరిగి వినియోగంలోకి తీసుకు రావాలని సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్ర బాబు పేర్కొన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌తో కలిసి మండలంలోని పెద్దఈటిపాకం, సత్యవేడు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అక్కడి బృందావనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఈనెల 15 తేదీలోపు బృందావనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని వివరించారు. గ్రీన్ అంబాసిడర్లకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఈవోపీఆర్‌డీ తరుణాక్షరెడ్డి, సత్యవేడు పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

ఎట్టకేలకు చెత్త తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట గ్రామంలోని సూళ్లూరుపేట రోడ్డుపక్కన ఉన్న చెత్త, వ్యర్థాలను సర్పంచ్ విద్యానాథరెడ్డి మంగళవారం ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో తొలగించారు. గ్రామంలోని చెత్తను రోడ్డు పక్కన పడవేయంతో చెత్త పేరుకుపోయింది. స్పందించిన సర్పంచ్ చెత్త, వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించారు.

అటెండర్ కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మార్కెట్ యార్డులో అటెండర్‌గా పనిచేస్తున్న మునీంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి వారి ఇంటికి వెళ్లారు. మునీంద్ర చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

త్రిశూల స్నానానికి సర్వం సిద్ధం



స్వర్ణముఖిలో త్రిశూల స్నానానికి ఏర్పాటు చేస్తున్న సద్యోముక్తి ప్రదేశం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయం పక్కనే ఉన్న స్వర్ణముఖి నదిలో త్రిశూల స్నానం మహోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ముందు మాఘపూర్ణిమ పురస్కరించుకుని త్రిశూల స్నాన ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈనేపథ్యంలో ఆలయంలో బుధవారం ఉదయం 9గంటలకు పంచ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయం నుంచి స్వర్ణముఖి నదిలోని సద్యోముక్తి ప్రదేశం వరకు ఊరేగింపుగా సాగుతారు. నదిలో సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నాన ఘట్టాన్ని సద్యోముక్తి ప్రదేశంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. త్రిశూల స్నానం జరిగే సమయంలో భక్తులు పుణ్యస్నానం అచరించేందుకు పెద్దఎత్తున తరలి రానున్నారు.

దళితులకు భూమి పట్టాలు ఇవ్వాలి: సీపీఎం



ధర్నా చేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం రెవెన్యూలోని సర్వే నెంబరు 81లోగల 82 ఎకరాలు ప్రభుత్వ భూమిని దళితులకు ఇళ్ల పట్టాలుగా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం దళితులతో కలసి ధర్నా చేశారు. అనంతరం తహ సీల్దార్ సుబ్రమణ్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు భూస్వాములు రికార్డులను తారుమారు చేసి భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మణి, నాయకులు నలుగూరు రమణయ్య, జేకే రమణయ్య, సుబ్బయ్య, సూజత, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుపై దాడి



చికిత్స పొందుతున్న సెక్యూరిటీ గార్డు మూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న మూర్తి(30)పై ఇద్దరు గుర్తు తెలియని యువకులు దాడి చేశారు. శ్రీకాళహస్తి మండలం వేడాం దళితవాడకు చెందిన మూర్తి ప్రభుత్వాస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుంటాడు. మంగళవారం ఆస్పత్రిలో విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఇద్దరు గుర్తు తెలియని యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డగించారు. హఠాత్తుగా మీద పడి చేతులతో దాడి చేశారు. ఓ యువకుడి ఉంగరం తలకు తగలడంతో మూర్తి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరాడు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రారండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని పలువురు కేంద్రమంత్రులు, ఎంపీలను మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీలో కేంద్రమంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, మనసుఖ్ మండేయియా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగిని, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావుని కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రికలను అందజేశారు. అదేవిధంగా గుడిమల్లం బ్రహ్మోత్సవాలకు కూడా హాజరు కావాలని కోరారు.

బాలికల గురుకులానికి బ్లీచింగ్ వితరణ



బ్లీచింగ్‌ను అందజేస్తున్న చిన్నారి గీతిక

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాసా గార్డెన్ బాలికల గురుకులానికి చుక్కల నిడిగల్లు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి చుక్కల పవన్‌కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం 50కేజీల బ్లీచింగ్ పౌడర్‌ను అందజేశారు. ఈ పాఠశాలలో చదువుతున్న పవన్‌కుమార్ చెల్లి చుక్కల గీతిక చేతుల మీదుగా బ్లీచింగ్‌ను ప్రిన్సిపాల్ మాధవీలతకు అందజేశారు. టీచర్ కోటేశ్వరి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి11 ఆంధ్రజ్యోతి): గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు దివాకర్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం 60 మంది గర్భిణులకు డాక్టర్ దివాకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కోసం నమోదు చేసుకుంటే కేంద్రం రూ.5వేలు ఇస్తుందని వివరించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 9న రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో స్టార్ జూనియర్ లెవల్-1లో శ్రీకాళహస్తి పట్టణం ఎంజీఎం పాఠశాలకు చెందిన రెండవ తరగతి విద్యార్థిని కె.హనీషా అర్హత సాధించింది. ఈ విద్యార్థినికి నిర్వాహకులు సర్టిఫికెట్, కప్ అందజేశారు. మంగళవారం పాఠశాలలో డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య చిన్నారిని అభినందించారు.

బిందు సేద్యంతో సత్ఫలితాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులు బిందు సేద్యంతో సత్ఫలితాలు సాధించవచ్చని గుంటూరు ఓఎస్‌డీ జనరల్, జిల్లా సూక్ష్మ సేద్యాధికారి రమేష్ అన్నారు. తొట్టంబేడు మండలంలోని శ్రీకృష్ణాపురంలో వసంత, కాళయ్య పొలంలో సూక్ష్మ సేద్య పథకం ద్వారా రాయితీపై అందించిన వ్యవసాయ పరికరాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ సేద్య ఇంజనీర్, సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు సమస్యలు పరిష్కరించాలి

జేసీ, సీఎండీలకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం వానెల్లూరు వద్ద తుడా పరిధిలో ఐఎంజీ లే అవుట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుడా పరిధిలోని ఈ లే అవుట్ ఏర్పాటు చేయడం వల్ల మధ్య తరగతి ఉద్యోగులకు, ప్రజలకు తక్కువ ధరకు ఇంటి ప్లాట్లు అందుతుందన్నారు. త్వరలో లే అవుట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లకు త్వరగా టెండర్లు ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపట్టాలని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ కె.సంతోష్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. ఇందుకు సీఎండీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఫ్లెక్సీలతో ఇబ్బందులు పడుతున్న జనం



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 11 ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎక్కడబడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం తెలుగుగంగ, తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రి, ఈబీసీ కాలనీలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలు గాలికి పడిపోవడంతో వాహ నదారులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

జీతాలు పెంచాలని పంచాయతీ కార్మికుల ధర్నా



పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన కార్మికులు

రేణిగుంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు ఆందోళనకు దిగారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇచ్చే జీతాలను కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. దీనికితోడు జీతాల నుంచి నగదు పట్టుకుంటున్నా పీఎఫ్‌కు మాత్రం జమ చేయడం లేదని తెలిపారు. యూనిఫామ్ కుట్టు కూలీలు కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆరు నెలల క్రితం డీపీవోను కలిసి వినతిపత్రం సమర్పించినా ఇంత వరకు స్పందన లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ బకాయిలు చెల్లించడంతోపాటు పీఎఫ్ ఖాతాకు నగదు జమ చేసి ప్రస్తుతమిస్తున్న జీతాలను పెంచాలని కోరారు. లేనిపక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

భూసేకరణ చట్టం -2013 ప్రకారం పరిహారం ఇవ్వాలి



ఇరుగుళంలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

సత్యవేడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, కొల్లడం, పెద్దఈటిపాకం గ్రామాలలో ఏపీఐఐసీ ద్వారా ప్రభుత్వం సేకరించనున్న భూములకు భూసేకరణ చట్టం-2013 ప్రకారం పరి హారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వీ.వెంక టేశ్వర్లు డిమాండ్ చేశారు. భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన గ్రామాలలో స్థానిక రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. రైతులతో చర్చించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు సైతం నిర్వహించకుండా ప్రభుత్వం ఏక పక్షంగా భూసేకరణకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చట్ట ప్రకారం భూసేకరణ జరిపి రైతులకు, వ్యవసాయ కూలీలకు న్యాయం చేయాలని కోరారు. కొందరు పెత్తందారులు అక్రమ కేసులతో భయపెట్టి రైతులెవ్వరూ తిరగబడకుండా కుట్ర పన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దాసరి జనార్ధన్, నాయకులు రమేష్, మునస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.